

మామిళ్లపల్లి సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు (ఫైల్)

కరెంటు కటకట..!



వేసవి రాకనే రైతులకు కష్టాలు

తడి అందక ఎండుతున్న పంటలు

సబ్‌స్టేషన్లను ముట్టడిస్తున్న అన్నదాతలు

- కరెంటు కోతలు, లో ఓల్టేజీ సమస్యతో పంటలు ఎండుతున్నాయని కనగానపల్లి మండలం చంద్రాచెర్ల, దాదులూరు, కుర్లపల్లి, తండా గ్రామాల రైతులు ఈ నెల ఒకటో తేదీన ధర్నా చేశారు. మామిళ్లపల్లి సబ్ స్టేషన్‌ను ముట్టడిచారు.
- ముదిగుబ్బ మండలం ముక్తాపురం రైతులు గత నెల 25న ఆందోళనకు దిగారు. ప్రధాన రహదారిపై బైఠాయించారు. వ్యవసాయానికి నాలుగైదు గంటలుకూడా కరెంటు వదలం లేదని మండిపడ్డారు.
- కంబదూరు మండలం వెంకటంపల్లి రైతులు వ్యవసాయానికి సక్రమంగా కరెంటు ఇవ్వడం లేదంటూ గత నెల 24న ఆందోళన చేపట్టారు. కళ్యాణదుర్గంలోని విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. కార్యాలయం తలుపులు మూసి నిరసన తెలిపారు.

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 6: వర్షాలు లేక ఖరీఫ్‌లో పంటను తీవ్రంగా నష్టపోయారు. బోరు బావుల కింద రబీ పంటతోనైనా గట్టెక్కుదామని ఆశించారు. ఆ పరిస్థితీ కనిపించడం లేదు. వ్యవసాయ విద్యుత్ కోతలు, లో ఓల్టేజీ సమస్యతో పంటలు నిలువునా ఎండిపోతున్నాయి. వ్యవసాయానికి తొమ్మిది గంటల విద్యుత్ ఇస్తున్నామని వైసీపీ ప్రభుత్వం ఊదరగొడుతోంది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. రైతులు నిత్యం ఏదో ఓ ప్రాంతంలో రోడ్డెక్కి ఆందోళనకు దిగడం ఇందుకు నిదర్శనం. వేసవి రాకమునుపే పరిస్థితి ఇలా ఉంటే.. రానున్న రోజుల్లో ఇంకెలా ఉంటుందోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

పెరుగుతున్న వినియోగం

ఉమ్మడి జిల్లాలో 733 ఫీడర్ల ద్వారా వ్యవసాయాకి విద్యుత్ సరఫరా అవుతోంది. ఆరు డివిజన్ల పరిధిలో 3.31 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇప్పుడిప్పుడే ఎండలు పెరుగుతున్నాయి. దీంతో విద్యుత్ వినియోగం కూడా పెరుగుతోంది. రోజువారీ వినియోగం 21 మిలియన్ యూనిట్లు ఉంటోంది. ఈ క్రమంలో చాలా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. ఈ పరిస్థితి చూసి రైతులు ఆందోళన చెందుతున్నారు. లక్షలు పెట్టుబడి పెట్టి సాగుచేసిన పంటలు చేతికి అందుతాయో లేదోనని భయపడుతున్నారు. నీటి తడులు అందక పంటలు దెబ్బతింటున్నాయని వాపోతున్నారు. పంటలను రక్షించుకునేందుకు ఆందోళనలకు దిగుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని చాలా ఫీడర్ల పరిధిలో విద్యుత్ సమస్యలు తలెత్తున్నాయి. లో ఓల్టేజీ, హై ఓల్టేజీ సమస్యలతో సతమతమౌతున్నారు. కనగానపల్లి, సీకే పల్లి, ఆత్మకూరు, కూడేరు, రాప్తాడు, ధర్మవరం, కదిరి, శెట్టూరు, అగళి తదితర ప్రాంతాల్లో విద్యుత్ పరమైన సమస్యలతో రైతులు అవస్థలు పడుతున్నారు.



ముదిగుబ్బ మండలం పూజారి తండా వద్ద ఎండుతున్న వేరుశనగ పంట



కనగానపల్లి మండలం చంద్రాచెర్ల వద్ద...

వేలాది ఎకరాల్లో పంటలు

జిల్లాలో బోరుబావుల కింద సాగువిస్తీర్ణం వేల ఎకరాల్లో ఉంది. రబీ పంటగా వేరుశనగను ఎక్కువగా సాగుచేస్తున్నారు. దీంతోపాటు మిర్చి, టమోటా, బెండ, చిక్కుడు తదితర కూరగాయలను కూడా విస్తారంగా సాగుచేస్తున్నారు. దానిమ్మ, మామిడి, చీనీ తదితర పండ్ల తోటలు కూడా విస్తారంగా ఉన్నాయి. వీటన్నింటికీ నీటి సమస్య తలెత్తుతోంది.

రాత్రిళ్లు వదులుతున్నారు..

వ్యవసాయానికి రాత్రి వేళల్లో కరెంటు వదులున్నారు. దీంతో ఇబ్బందులు తప్పడం లేదు. పగటి పూట కరెంటు ప్రకటనలకే పరిమితమౌతోంది. కనీసం తెల్లవారుజామున 5 గంటల నుంచి కరెంటు వదిలినా మాకు ఇబ్బంది ఉండదు. అర్ధరాత్రి 12 గంటల నుంచి తెల్లవారు జామున 4 గంటల వరకు ఒక విడత వదులుతున్నారు. అ సమయంలో రైతులు పొలాలకు వెళ్లాల్సి వస్తోంది. ఆ సమయంలో ఏదైనా సమస్య తలెత్తితే అంతే సంగతి. దీనికితోడు ఎల్‌సీ, సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల పేరిట అర గంట, పదిహేను నిమిషాలు సరఫరా నిలిపేస్తున్నారు. పగటిపూట, నాణ్యమైన కరెంటు వదిలితే బాగుంటుంది.



- వన్నారెడ్డి, పూలకుంట, అనంతపురం రూరల్ మండలం

లో ఓల్టేజీతో ఇబ్బందులు..

ఏడు ఎకరాల్లో వేరుశనగ సాగుచేశాను. లో ఓల్టేజీతో సక్రమంగా నీరు అందించలేకున్నాను. పంట దెబ్బతింటోంది. విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లినా ప్రయోజనం లేకుండా పోతోంది.



- నాగార్జున, చంద్రాచెర్ల, కనగానపల్లి మండలం

ఎన్నికల కోసం ప్రజాధనం దోపిడీ

సీఎం జగన్ అర్జునుడు కాదు.. సైతాన్

బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్



మాట్లాడుతున్న సత్యకుమార్

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 6: ఎన్నికల కోసం సీఎం జగన్ ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ ఆరోపించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులుతో కలిసి మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం జిల్లాకు లాజిస్టిక్ పార్కును మంజూరు చేసిందని, కానీ దీని ఏర్పాటుకు అవసరమైన 204 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వలేదని అన్నారు. కడపలో దళిత, గిరిజన చిన్న పారిశ్రామికవేత్తలు తమకు రావాల్సిన రూ.106 కోట్ల బకాయిల కోసం ధర్నా చేశారని అన్నారు. ప్రగతి పట్ల సీఎం జగన్‌కు ఉన్న చిత్తశుద్ధి ఇదేనా అని ప్రశ్నించారు. ఎంఎస్ ఎంఈల కోసం కేంద్రం విడుదల చేసిన రూ.2,600 కోట్లను మాయం చేశారని ఆరోపించారు. జగన్ అమలు చేస్తున్న ఆసరా, చేయూత పథకాలు మోసపూరితమైనవని అన్నారు. రాష్ట్రంలోని పేదల కోసం 21 లక్షల ఇళ్లను కేంద్రం మంజూరు చేసిందని, తొమ్మిది లక్షల ఇళ్లను నిర్మించామని పార్లమెంటులో వైసీపీ ఎంపీలు చెబుతున్నారని అన్నారు. అనంతపురం జిల్లాలో 95 వేల ఇళ్లకుగా 36 వేలు, కడపలో 1.09 లక్షలకుగాను 42 వేలు, శ్రీసత్యసాయి జిల్లాలో 64 వేలకుగాను 19 వేల ఇళ్లను మాత్రమే నిర్మించారని అన్నారు. రాయలసీమ రెడ్డిగా జగన్ చేసిన ఈ ప్రాంతానికి అన్యాయం చేశారని మండిపడ్డారు. రాయలసీమలోని ఏ జిల్లాలోనూ 25 నుంచి 30 శాతం నిర్మాణాలు కూడా పూర్తికాలేదని అన్నారు. విద్య, వ్యవసాయాలను జగన్ నిర్వీర్యం చేశారని అన్నారు. పెండింగ్ ప్రాజెక్టులకు పైసా విదల్చలేదని విమర్శించారు. జగనన్న కాలనీల పేరిట రూ.కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. ఎన్నికల నేపథ్యంలో పులివెందుకు ఉపాధి పథకం కింద 349 పనులు కేటాయించారని, రూ.26 కోట్లను దోచిపెట్టారని అన్నారు. పులివెందుల అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధా అని ఆయన ప్రశ్నించారు. జగన్ అర్జునుడు కాదని, అతను ఓ సైతాన్ అని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రజలే జీసస్‌లుగా మారి జగన్ పాలనను అంతం చేయాలని కోరారు.

ఎన్నికల వేళ అప్రమత్తంగా ఉండాలి

అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి, ఎస్పీ అన్బురాజన్

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 6: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అన్నిశాఖల అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టరు గౌతమి సూచించారు. ఎస్పీ అన్బురాజన్, జేసీ కేతన్‌గార్గ్‌తో కలిసి కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. జిల్లాలో సున్నితమైన ప్రాంతాలను గుర్తించాలని, అక్కడ సెక్షన్ 123, ఆర్‌పీ యాక్ట్ 171-బి, 171-సిని అమలు చేయాలని ఆదేశించారు. అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలలో చెక్‌పోస్టులను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. అక్రమంగా డబ్బు, మద్యం, మాదక ద్రవ్యాలు జిల్లాలోకి రాకుండా గట్టి నిఘా ఉంచాలని సూచించారు. సరిహద్దు చెక్‌పోస్టులవద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. చెక్‌పోస్టుల వద్ద సీజ్ చేసిన వాటి సమాచారం రోజువారీగా పంపాలని సూచించారు. ఇప్పటికే జిల్లాలో గట్టి నిఘా పెట్టామని ఎస్పీ అన్బురాజన్ తెలిపారు. సరిహద్దు ప్రాంతాలలో 24 చెక్‌పోస్టులు, ఆరు డైనమిక్ చెక్‌పోస్టులును ఏర్పాటు చేశామని అన్నారు. రైల్వే, ఆర్టీసీ బస్టాండ్‌లలో కూడా చెక్‌పోస్టులు పెట్టాలని సూచించారు. ఎన్నికల నేపథ్యంలో ఆదాయ, వాణిజ్య పన్ను శాఖల అధికారుల పాత్ర కీలకమని అన్నారు. సమావేశంలో జడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియా, సెబ్ ఏఎస్పీ రామక్రిష్ణ, ఆర్డీఓలు గ్రంధి వెంకటేష్, శ్రీనివాసులరెడ్డి, ఈఆర్‌ఓలు రాంభూపాల్‌రెడ్డి, కరుణ కుమారి, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతి ఉత్సవాలపై సమీక్ష

గుత్తి రూరల్, ఫిబ్రవరి 6: మండలంలోని సేవాఘడ్‌లో ఈ నెల 13నుంచి నిర్వహించే సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలని డీటీడబ్ల్యూఓ రామాంజనేయులు సూచించారు. అన్ని శాఖల అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ నెల 13, 14, 15 తేదీల్లో జరిగే సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలకు హాజరయ్యే లక్షలాది మంది భక్తులకు సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని అన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దారు లలిత, ఎంపీడీఓ శ్రీనివాసులు, ట్రస్టు అధ్యక్షుడు జగన్నాథరావు, టీటీడీ బోర్డు సభ్యుడు అశ్వత్థ నాయక్ పాల్గొన్నారు.

వైసీపీలో ఓటమి భయం

కాంగ్రెస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గౌతమ్



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గౌతమ్

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 6: రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి కాంగ్రెస్‌పై చేసిన వ్యాఖ్యలు సరికాదని, ఓటమి భయంతోనే ఆయన ఈ వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ అన్నారు. ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌తో కలిసి డీసీసీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. రాజ్యసభలో విజయసాయిరెడ్డి అవివేకంతో మాట్లాడినట్లు ఉందని అన్నారు. బీజేపీకి తొత్తుగా మారిన వైసీపీ.. బీజేపీ-2 గా మారిందని రాష్ట్ర ప్రజలకు తెలుసునని అన్నారు. కాంగ్రెస్ పార్టీ చట్టం చేయనందుకే ఏపీకి ప్రత్యేక హోదా రాలేదని బీజేపీకి మద్దతుగా వైసీపీ నాయకులు మాట్లాడటాన్ని వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని అన్నారు. ప్రత్యేక హోదా అమలుకు చట్టం చేయాల్సిన అవసరం లేదని, కేంద్ర కేబినెట్ ఆమోదం సరిపోతుందని అన్నారు. దీనిపై 2014 మార్చిలోనే కేబినేట్ నిర్ణయం జరిగిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని అడ్డంగా విభజించిందని జగన్ అంటున్నారని, వైఎస్సార్ సమాధి సాక్షిగా 2012, డిసెంబరు 28న రాష్ట్ర విభజనకు అనుకూలంగా జగన్ లేఖ రాయలేదా అని ప్రశ్నించారు. రాజ్యసభలో సాయిరెడ్డి వ్యాఖ్యలను చూస్తుంటే వైసీపీకి ఓటమి భయం పట్టుకున్నట్లు స్పష్టమౌతోందని అన్నారు. ఓడిపోయే ముందైనా నిజాలు మాట్లాడాలని హితవు పలికారు. పూర్తి పేరు చెప్పుకోలేని వైసీపీ ఒక దొంగ పార్టీ అని అన్నారు. కాంగ్రెస్ గురించి మాట్లాడే అర్హత ఆ పార్టీ నాయకులకు లేదని అన్నారు. వైసీపీ అధినేత జగన్ మొదట ఏ పార్టీ నుంచి ఎంపీ అయ్యారో మరువకూడదని అన్నారు. ప్రాంతీయ పార్టీల్లో దేనికి ఓటు వేసినా బీజేపీకి వేసినట్లే అని అన్నారు. బీజేపీతో పోరాటం చేసి రాష్ట్ర హక్కులను కాపాడుకోలేనివారు కాంగ్రెస్‌పై మాత్రం విమర్శలు చేస్తారు అని ఎద్దేవా చేశారు. వైసీపీ నాయకులకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

డీఈఓగా వరలక్ష్మి

అనంతపురం విద్య, ఫిబ్రవరి 6: జిల్లా విద్యాశాఖ అధికారిగా బి. వరలక్ష్మిని నియమిస్తూ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఐదు నెలలుగా అనంతపురం డీఈఓ పోస్టు ఖాళీగా ఉంది. ఇన్‌చార్జ్ డీఈఓగా ఏడీ నాగరాజు వ్యవహరిస్తున్నారు. గత ఏడాది ఆగస్టు నుంచి ఆయనే ఇన్‌చార్జిగా ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పలువురు డిప్యూటీ డీఈఓలు, ఏడీలు, డైట్ లెక్చరర్లకు డీఈఓలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ క్రమంలో రాయచోటి డిప్యూటీ డీఈఓగా పనిచేస్తున్న వరలక్ష్మికి డీఈఓగా ఉద్యోగోన్నతి కల్పించి, అనంతపురం డీఈఓగా నియమించారు. ఈ మేరకు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ జీవో 46 విడుదల చేశారు. ఆమె గతంలో జిల్లాలో ఏడీగా కొంతకాలం పనిచేశారు. వరలక్ష్మి త్వరలోనే విధుల్లో చేరుతారని జిల్లా విద్యాశాఖాధికారులు తెలిపారు.

బి.వరలక్ష్మి →



నేడు, రేపు రాకపోకలు బంద్

రాప్తాడు, ఫిబ్రవరి 6: రాప్తాడు సమీపంలోని రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్న కారణంగా బుధ, గురువారాలు రైల్వే గేటు వద్ద రాకపోకలు నిలిపివేసినట్లు అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటశివారెడ్డి, రాప్తాడు సీఐ మునిస్వామి ప్రకటించారు. ఆ రెండు రోజులు వాహనదారులు ప్రత్యామ్నాయ దారుల గుండా వెళ్లాలని సూచించారు. కదిరి నుంచి పంగల్‌రోడ్డు, రాప్తాడు మీదుగా జాతీయ రహదారి 44పై వెళ్లే వాహనాలు అనంతపురం నగరం మీదుగా వెళ్లాలన్నారు. హైదరాబాద్, మరూరు టోల్ గేటు నుంచి కదిరి వెళ్లే వాహనాలు కూడా అనంతపురం నగరం మీదుగా పంగల్ రోడ్డు, కదిరి వైపు వెళ్లవచ్చని అన్నారు. కదిరి వైపు నుంచి వచ్చే భారీ వాహనాలు, కలెక్టరేట్, చెరువు కట్ట, మీదుగా సోమలదొడ్డి వద్ద జాతీయరహదారి 44పై హైదరాబాద్‌కు వెళ్లవచ్చన్నారు. వాహనదారులు పోలీసులకు సహకరించాలని కోరారు.

పరిష్కారం కాదు.. సమస్యే..!

ఆర్‌యూబీ ప్లాన్ మార్పుపై విమర్శలు

- ధర్మవరం గేట్ వద్ద ట్రాఫిక్ సమస్య
- లెవెల్ క్రాసింగ్ తొలగించనున్న రైల్వే శాఖ
- ఆ స్థానంలో వంకర.. ఇరుకైన అండర్ బ్రిడ్జి
- ఇదే జరిగితే ట్రాఫిక్ సమస్య మరింత జటిలం
- ఎత్తు పెంచాలని టీడీపీ, సీపీఐ, పట్టణవాసుల డిమాండ్

గుంతకల్లు, ఫిబ్రవరి 6: పట్టణంలో ధర్మవరం గేటు వద్ద నిర్మించే రోడ్ అండర్ బ్రిడ్జి వ్యవహారం వివాదాస్పదంగా మారింది. గుంతకల్లు-ధర్మవరం రైల్వే సెక్షన్‌లో 157వ నంబరు లెవెల్ క్రాసింగ్ ప్రస్తుతం సమస్యలకు నిలయంగా మారింది. గుంతకల్లు నడి బొడ్డున ఉన్న ఈ రైల్వే గేటు గుండా రోజూ వేలాది వాహనాలు వెళుతున్నాయి. ఈ గేటు వెడల్పు సుమారు 30 అడుగులు కాగా, రహదారి వెడల్పు 40 అడుగులకు మించి ఉంటుంది. అయినా రైళ్ల రాకపోకల సమయంలో ట్రాఫిక్ జామ్ అవుతోంది. సమస్య పరిష్కారం కోసం రోడ్ అండ్ బ్రిడ్జిగాని, రోడ్ ఓవర్ బ్రిడ్జిని గాని నిర్మించాలని పట్టణ వాసులు చాలాకాలంగా కోరుతున్నారు. రైల్వే శాఖ కూడా లెవెల్ క్రాసింగ్‌లను తొలగించే కార్యక్రమాన్ని డివిజన్ వ్యాప్తంగా ముమ్మరంగా చేపడుతోంది. టీడీపీ ప్రభుత్వ హయాం నుంచి ధర్మవరం గేటు వద్ద వంతెనను నిర్మించి, కసాపురం రహదారిలో ఉన్న అర్‌యూబీని విస్తరించాలని ప్రజా ప్రతినిధులు రైల్వే శాఖకు విజ్ఞప్తి చేస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో రైల్వే శాఖ ధర్మవరం గేటు వద్ద ఆర్‌యూబీని నిర్మించాలని నిర్ణయించింది. భూసేకరణ ఖర్చును మున్సిపాలిటీ భరించేట్లయితే వంతెనను నిర్మిస్తామని రైల్వే అధికారులు ప్రతిపాదించారు. దీనికి మున్సిపాలిటీ పాలకవర్గం అంగీకరించింది.

వైసీపీ ఘనతేనట..

రైళ్ల వేగాన్ని పెంచేందుకు, సిబ్బందిని తగ్గించుకునేందుకు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ అండ్ సేఫ్టీ కార్యక్రమం కింద రైల్వే శాఖ దేశవ్యాప్తంగా ఎల్సీలను తొలగించి, ఆర్‌యూబీ.. ఆర్‌ఓబీలను నిర్మిస్తోంది. కానీ గుంతకల్లులో నిర్మించే ఆర్‌యూబీని సాధించడం తమ ఘనతే అని వైసీపీ నాయకులు జబ్బలు చరచుకుంటున్నారు. ఫ్లెక్సీలు పెట్టి మరీ ప్రచారం చేసుకుంటున్నారు. దీనికి టీడీపీ, సీపీఐ తీవ్ర అభ్యంతరం చెబుతున్నాయి. ఆర్‌యూబీ మంజూరు కావడం వైసీపీ ప్రజాప్రతినిధుల గొప్పే అయితే కసాపురం రోడ్డులో సమస్యగా ఉన్న ఆర్‌యూబీని వెడల్పు చేయించవచ్చు కదా అని ప్రశ్నిస్తున్నారు.

మారిన ప్లాన్‌తో సంకటం

ధర్మవరం గేటు వద్ద ఆర్‌యూబీ నిర్మించడానికి పట్టణవాసుల నుంచి ఎటువంటి అభ్యంతరాలు లేవు. ధర్మవరం గేటుకు రెండు వైపులా ఉన్న రహదారి ఎటువంటి వంకర్లు లేకుండా తిన్నగా ఉంటుంది. రైలు రోడ్డు కింద వంతెనను (ఆర్‌యూబీ) తొలుత రహదారి ఎలా ఉందో అలాగే నేరుగా నిర్మించాలని రైల్వే అధికారులు నిర్ణయించారు. కానీ తర్వాత వైసీపీ నాయకుల ప్రోద్బలంతో ఆర్‌యూబీ ప్లాన్‌ను మార్చారు. రహదారిలో ఎక్కువ దుకాణాల తొలగింపు జరగకుండా, వంతెనను నేరుగా కాకుండా ఆంగ్ల అక్షరం 'సి' ఆకృతిలో నిర్మించాలని స్కెచ్‌ను సిద్ధం చేశారు. ఆర్‌యూబీ వెడెల్పు 5.5 మీటర్లు, ఎత్తు 3.6 మీటర్లు ఉండేలా ప్లాన్ సిద్ధం చేశారు. టెండర్లను కూడా పిలిచారు. దీనిపై అభ్యంతరాలు ప్రారంభమయ్యాయి. నేరుగా వెళ్లాల్సిన వంతెనను వంకర్లు తిప్పడం, తగిన ఎత్తు లేకుండా కట్టడానికి సిద్ధపడటంతో పట్టణవాసుల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోంది. వంతెన ఎత్తు లేకుంటే భారీ వాహనాలు వెళ్లడానికి సాధ్యపడదు. వంతెన వంకర్లు తిప్పినందున ట్రాఫిక్ జాం సమస్య పునరావృతం అవుతుందని పట్టణవాసులతోపాటు టీడీపీ, సీపీఐ నాయకులు అభ్యంతరం చెబుతున్నారు.



ధర్మవరం గేటు వద్ద సి ఆకృతిలో ఆర్‌యూబీని నిర్మించడానికి సిద్ధంచేసిన ప్లాన్



ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్న ధర్మవరం గేటు (ఎల్సీ నెం. 157)

ఆర్‌యూబీతో కష్టాలే..

పట్టణంలోని ధర్మవరం గేటు వద్ద నిర్మించే ఆర్‌యూబీ తగిన ఎత్తు లేని కారణంగా ప్రజలకు ఇబ్బందులు తప్పవు. ప్రస్తుతం ఇక్కడున్న ఎల్సీ గుండా లారీలు, టిప్పర్లు, ఇతర భారీ వాహనాలు వెళ్లగలుగుతున్నాయి. కానీ 3.6 మీటర్ల ఎత్తులో ఆర్‌యూబీని నిర్మిస్తే భారీ వాహనాలు వెళ్లడానికి సాధ్యపడదు. కనీసం అంబులెన్సు కూడా వెళ్లలేదు. ట్రాక్టర్లు వంతెనలోకి వెళితే గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుందని పట్టణ ప్రజలు, టీడీపీ, సీపీఐ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ భారీ వాహనాలు వెళ్లలేకపోతే.. పట్టణాన్ని చుట్టేసి.. బళ్లారి గేటు నుంచి వెళ్లాల్సి వస్తుంది. అది ఎంతో ఇబ్బందికరంగా ఉంటుంది. రైల్వే స్టేషన్ వద్ద నుంచి లారీలు వెళ్లగలిగే పరిస్థితులున్నా.. రైల్వే కాలనీల రోడ్లు చిన్నగా ఉన్నాయి. వంతెనను వంకర తిప్పి నిర్మించినా ఫర్వాలేదుగాని.. ఎత్తు 5.5 మీటర్లకు పెంచాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్ డీఆర్‌ఎంకు విజ్ఞప్తి చేశారు.

ముడుపులు అందాయేమో: జగదీశ్



మాట్లాడుతున్న జగదీశ్

గుంతకల్లు టౌన్: ధర్మవరం గేట్ వద్ద బ్రిడ్జి నేరుగా వేయకుండా వంకర తిప్పినందుకు రైల్వే అధికారులకు ముడుపులు అందినట్లు స్పష్టంగా కనబడుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు డి.జగదీశ్ ఆరోపించారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టణంలోని ప్రధాన రహదారులలో రైల్వే లైన్లు వెళ్లాయని, దీంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని అన్నారు. ధర్మవరం గేట్ వద్ద సి ఆకృతిలో బ్రిడ్జి నిర్మాణానికి రైల్వే అధికారులు టెండర్లను పిలిచారని, 3.5 మీటర్ల ఎత్తులో బ్రిడ్జిని నిర్మిస్తే ట్రాఫిక్ సమస్య మరింత పెరుగుతుందని అన్నారు. దీనిపై డీఆర్‌ఎంను ప్రశ్నిస్తే నాలుగు మీటర్లకు ఎత్తు పెంచామని అంటున్నారని, అయినా ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని అన్నారు. నేరుగా బ్రిడ్జి నిర్మిస్తే ఎవరి దుకాణాలూ పోవని అన్నారు. కసాపురం రోడ్డులో బ్రిడ్జి ఎత్తు 5 మీటర్లకు పెంచాలని ఎమ్మెల్యే డీఆర్‌ఎంను కోరారని, మరి సబ్‌వే బ్రిడ్జి వేయాలని ఎమ్మెల్యే ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకుంటే ఫ్లైఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ఈ విషయాన్ని రైల్వే జీఎం దృష్టికి తీసుకెళతామని అన్నారు.

10న 'ఇన్‌స్పైర్' ఎగ్జిబిషన్

అనంతపురం విద్య, ఫిబ్రవరి 6 : 'ఇన్‌స్పైర్ 2022-23 అవార్డ్స్ ఎగ్జిబిషన్ ఈ నెల 10వ తేదీ నగర శివారులోని రాప్తాడు మోడల్ స్కూల్‌లో నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ డీఈఓ నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఇన్‌స్పైర్ అవార్డులు పొందిన స్కూల్స్ ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు విద్యార్థులతో ఎంపికైన ప్రాజెక్టుల నమూనాలు తయారు చేయించి ఎగ్జిబిషన్‌లో పాల్గొనాలన్నారు. జిల్లావ్యాప్తంగా 103 ప్రాజెక్టులు ఎంపికయ్యాయని, ఆయా స్కూళ్ల నుంచి విద్యార్థులు, గైడ్ టీచర్లు తప్పనిసరిగా ఎగ్జిబిషన్‌లో పాల్గొనాలని సూచించారు. సమాచారం, సందేహాల నివృత్తి కోసం జిల్లా సైన్స్ ఆఫీసర్ బాలమురళీకృష్ణను సంప్రదించాలని తెలిపారు.

ప్రచారాలను నమ్మకండి : డీఐపీఆర్ఓ

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 6: విలేకరులకు ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఇంటి స్థలాల విషయంలో సోషల్‌మీడియా ప్రచారాలను నమ్మవద్దని జిల్లా పౌరసంబంధాలశాఖ పీఆర్ఓ గురుస్వామిశెట్టి మంగళవారం ఓప్రకటనలో కోరారు. ఇప్పటికీ రెవెన్యూశాఖలో దరఖాస్తుల పరిశీలన జరుగుతోందని, పరిశీలన తర్వాతే అర్హుల జాబితాను ప్రకటిస్తామని తెలిపారు. ఎలాంటి వదంతులను నమ్మవద్దని ఆయన జర్నలిస్టులను కోరారు.

ప్రాక్టికల్స్‌కు 21 మంది గైర్హాజరు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 6: ఇంటర్ ఒకేషనల్ ప్రాక్టికల్స్‌కు 21 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఇంటర్ ఎగ్జామ్స్ కన్వీనర్ వెంకటరమణ నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 349 మందికిగాను 335 మంది హాజరుకాగా 14 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని, మధ్యాహ్నం 245 మంది విద్యార్థులకు గాను 238 మంది హాజరు కాగా మరో 7 మంది విద్యార్థులకు ప్రాక్టికల్స్‌కు హాజరుకాలేదన్నారు. ఆయన గార్లదిన్నె కేజీబీవీ, బుక్కరాయసముద్రం కేజీబీవీలను తనిఖీ చేశారు.

స్మగ్లర్ల వేటలో వీరమరణం

- అన్నమయ్య జిల్లాలో ధర్మవరం కానిస్టేబుల్ మృతి
- ఎర్రచందనం కారుకు అడ్డుగా వెళ్లిన వైనం
- వాహనం మీదికే వస్తున్నా.. వెనక్కి తగ్గని ధీరత్వం
- ఢీకొట్టి.. మీదుగా కారును తోలిన దుండగులు..
- అక్కడికక్కడే మృతి... కన్నీరుమున్నీరైన కుటుంబికులు



కానిస్టేబుల్ గణేశ్ (ఫైల్)



గణేశ్ మృతదేహం వద్ద విలపిస్తున్న అతడి భార్య అనూష

పీలేరు/ధర్మవరం, ఫిబ్రవరి 6: ఎర్రచందనం స్మగ్లర్ల వేటలో శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని గుట్టకిందపల్లి ప్రాంతానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ గణేశ్ (30) వీరమరణం పొందారు. అన్నమయ్య జిల్లా కేవీపల్లె మండలం ఎంపీపల్లె పంచాయతీ చెరువుముందర గుండ్రేవారిపల్లె గ్రామ స మీపంలోని గొల్లపల్లె చెరువు వద్ద మంగళవారం తెల్లవారుజామున ఎర్రచం దనం స్మగ్లింగ్‌ను అడ్డుకోబోయి వారి చేతిలో బలయ్యాడు. టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యుడైన గణేశ్.. స్మగ్లర్ల కారుకు అడ్డంగా వెళ్లారు. కుడి వైపు నుంచి న లుగురు సిబ్బంది రాగా.. ఎడమ వైపు నుంచి గణేశ్ ఒక్కరే కారుకు అడ్డుగా వచ్చా రు. బరితెగించిన స్మగ్లర్లు కారును ఆపినట్లే ఆపి.. వేగంగా గణేశ్ ఉన్న వైపు పోని చ్చారు. ఏమాత్రం భయపడకుండా గణేశ్ అలానే కారుకు అడ్డంగా వచ్చారు. కాని స్టేబుల్‌ను గుద్దేసి.. ఆయన మీదుగా కారు పోనిచ్చారు. దీంతో గణేశ్ తీవ్రంగా గాయపడ్డారు. పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రాణాలు వదిలారు.

మేమంతా వచ్చాం.. లే గణేశ్..

గణేశ్ మృతి విషయం తెలియగానే కుటుంబికులు, బంధువులు పీలేరు ఆస్పత్రికెళ్లారు. వారి ఆర్తనాదాలతో ఆస్పత్రి ప్రాంగణం దద్దరిల్లిపోయింది. 'నాకేమీ కాదు, నేను బాగానే ఉన్నాను, తెల్లారగానే ఇంటికి వచ్చేస్తానని చెబితివి కదా, మేమంతా వచ్చాం, లే గణేశ్' అంటూ ఏఆర్ కానిస్టేబుల్ మృతదేహంపై పడి అతడి భార్య అనూష పెట్టిన ఆర్తనాదాలు అక్కడున్న వారందరి కళ్లల్లో నీళ్లు తెప్పించాయి. గణేశ్‌కు ఇద్దరు కుమారులు రాజ్‌కిశోర్ (6), వేదాన్ష్ (2) ఉన్నారు. నిస్తేజంగా పడుకుని ఉన్న తండ్రిని, కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తల్లిని అమాయకంగా ఆ ఇద్దరు చూడడం అందరినీ కలచి వేసింది. బిల్లే శ్రీరాములు, అలివేళమ్మ దంపతులకు ఏకైక కుమారుడు గణేశ్ కాగా.. ముగ్గురు కుమార్తెలున్నారు. 8 ఏళ్ల క్రితం తండ్రి మృతిచెందారు. గణేశ్‌కు రామగిరి మండలం పెనుబోలు గ్రామానికి చెందిన అనూషతో వివాహమైంది. గణేశ్ అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ.. బంధువులందరిలోనూ మంచి వ్యక్తిగా మెలిగేవారని స్థానికులు చెబుతున్నారు. గణేశ్ మృతదేహాన్ని మంగళవారం రాత్రికి స్వగ్రామానికి తేనున్నట్లు బంధువులు తెలిపారు. బుధవారం గుట్టకిందపల్లి వద్ద పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

29లోగా దుకాణాల రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

- కార్మికశాఖ ఉపకమిషనర్ లక్ష్మీనరసయ్య

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 6 : దుకాణాలు, వాణిజ్య సముదాయాలను కార్మికశాఖద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకునే ప్రక్రియను ఈనెల 29వ తేదీలోపు పూర్తి చేయాలని జిల్లా కార్మికశాఖ ఉప కమిషనర్ లక్ష్మీనరసయ్య పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం జిల్లా కార్మికశాఖ కార్యాలయంలో నగరంలోని దుకాణదారులు, వాణిజ్య సముదాయాల నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దుకాణాలకు కార్మికశాఖ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ పొందాలన్నది గతంలో ఉన్న ప్రక్రియేనని, అయితే చాలామంది అవగాహనాలోపం వల్ల రిజిస్ట్రేషన్ చేయించుకోక జరిమానాలు చెల్లించాల్సి వస్తోందన్నారు. గతంలో మ్యానువల్‌గా ఉన్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను 2015 నుంచి ఆన్‌లైన్ ద్వారా మీసేవ కేంద్రాల ద్వారా పొందేలా చట్టం చేసిందన్నారు. దుకాణదారులు, వాణిజ్య సముదాయాల నిర్వాహకులు సమీపంలోని మీసేవ కేంద్రాల్లో సంప్రదించి కార్మికశాఖ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ పొందవచ్చునన్నారు. వ్యాపారులకు ఇది సువర్ణ అవకాశమన్నారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కార్యదర్శి రంగారెడ్డి, మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పిన్ని నాగరత్నం, క్లాత్స్ అసోసియేషన్ అధ్యక్షుడు హితేస్ జైన్, హోటల్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణ, జ్యువెలరీ అసోసియేషన్ ప్రతినిధి సయ్యద్, కార్మికశాఖ ఏఎల్ఓలు రాధా రమాదేవి, శ్రీవాణి, సుజాత తదితరులు పాల్గొన్నారు.



రైల్వే స్టేషన్ ముఖద్వారం

కొత్త సమస్యలు..!



- అనంత రైల్వే స్టేషన్లో ముందుకు సాగని అభివృద్ధి పనులు
- అసౌకర్యాలతో ప్రయాణికులు విలవిల
- డీఆర్ఎం ఆదేశించినా డోన్ట్ కేర్..



తాళం వేసిన విశ్రాంత గదులు

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి6: జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో 'కొత్త' సమస్యలు ప్రయాణికులను వేధిస్తున్నాయి. ఒకటి కాదు..రెండు కాదు..అన్నింటినీ మార్చేశారు.. ప్రధాన ద్వారం.. ప్లాట్‌ఫారం నెంబర్లు.. వెయిటింగ్ రూంలు.. ఇలా అన్నీ కొత్తవే. కానీ ఇక్కడే అసలు సమస్య తలెత్తుతోంది. పలు పనులు పెండింగ్‌లో ఉండగానే ఆర్భాటంగా ప్రా రంభించారే తప్ప, ఇబ్బందులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. దీనికి తోడు నిర్వాహణ సమస్యలతో ఉన్న వసతులను సైతం వినియోగంలోకి తీసుకురాక పోవడంతో మరిన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

- రైల్వే స్టేషన్‌ను ఆధునీకకరించి ప్రస్తుతం ఉన్న మార్గం నుంచి కాకుండా 1వ రోడ్డు నుంచి రాకపోకలు సాగించేలా ప్రధాన ద్వారం ఏర్పాటు చేశారు. అయితే ఈ నిర్మాణ పనులు కొన్ని సంవత్సరాలుగా జరుగుతున్నాయి. కాంట్రాక్టర్‌కు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతోనే.. పనులపై ఆసక్తి కొరవడిందని అంటున్నారు. అరకొర పనులు పూర్తి అయినప్పటికీ భవనాలను వినియోగంలోకి తీసుకొస్తే.. బిల్లుల చెల్లింపునకు మార్గం సుగమం అవుతుందన్న ఆలోచనతో అధికారులు హడావుడిగా ప్రారంభించేశారు. పాత భవనాలను ఖాళీ చేస్తున్నా, కొత్త భవనాల్లో సదుపాయాలు కొరవడ్డాయి.

- కొన్ని ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో వినియోగంలోకి వచ్చే లోపే అవి శిథిలావస్థలకు చేరుకొనే దుస్థితి నెలకొంది. గతంలో 1వ ప్లాట్‌పామ్‌గా ఉన్న ప్రధాన ద్వారాన్ని 4వ ప్లాట్‌పామ్‌గా మార్చారు. అయితే గుత్తి నుంచి వచ్చే రైళ్లు 4వ ప్లాట్‌పామ్, ధర్మవరం మీదుగా వచ్చే రైళ్లు 1,2 ప్లాట్‌పామ్స్ మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ఆ మార్గాలు ఉపయోగించక తప్పడం లేదు.

● ప్రయాణికులకు తప్పని తిప్పలు

రైల్వే స్టేషన్‌లో ఎక్కువ శాతం పాత ముఖద్వారం ద్వారానే రాకపోకలు సాగిస్తున్నారు. దీనికి ప్రధాన కారణం రైళ్లు దిగిన ప్రయాణికులకు పట్టణంలోకి రావడం, బస్టాండ్ వెళ్లాలన్నా ఈ మార్గమే అనుకూలంగా ఉంటుంది. నూతన మార్గం కొంత ఇబ్బందికరంగా మారింది. దీనికి తోడు నిర్మాణాలు పూర్తి కాక పోవడంతో అవకాశం ఉన్నవారు కూడా ఆమార్గం నుంచి రాలేని పరిస్థితి ఎర్పడింది. ఇక దివ్యాంగులు, వృద్ధుల పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారింది. ప్రస్తుతం స్టేషన్‌లో ఉన్న లిఫ్ట్ ఎప్పుడు పని చేస్తుందో.. ఎప్పుడు మొండికేస్తుందో అధికారులకే తెలియదు.



పని చేయని లిఫ్ట్

● ఉన్న వసతులను వినియోగంలోకి తీసుకురారు

రైల్వే స్టేషన్ ఆవరణంలో కొన్ని నిర్మాణాలు పూర్తి అయ్యాయి. అయితే నిర్వహణా భారంతో వాటిని అందుబాటులోకి తీసుకు రావడం లేదు. పాత స్టేషన్ గదుల వద్దే ప్రస్తుతం సిబ్బంది ఉన్నారు. వాటిని వదిలి కొత్తవాటి వద్దకు రాలేని పరిస్థితి.. దీనికి తోడు అవసరాలకు అనుగుణంగా సిబ్బందిని నియమించలేదు. స్లీపర్, ఉన్నత శ్రేణి, సాధారణ ప్రయాణికులకు సంబంధించి విశ్రాంతి గదులు అన్ని హంగులతో పూర్తి చేశారు. అయితే వాటిని అలా గాలికి వదిలేయడంతో ఆక తాయిలు అడ్డాగా మార్చుకున్నారన్న విమర్శలు వినిపిస్తు న్నాయి.

పనులు వేగవంతం చేయాలి : వినీత్‌సింగ్, డీఆర్ఎం

డీఆర్ఎం వినిత్‌కుమార్ సింగ్ ఇటీవల అనంత రైల్వే స్టేషన్‌ను పరిశీలించారు. రెండు గంటల పాటు పర్యటించిన ఆయన అభివృద్ధి పనుల జాప్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులను వేగంగా పూర్తి చేసి ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, స్టేషన్‌ను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. మందుబాబులకు ఆశ్రయం లేకుం డా చూడాలని స్టేషన్ మేనేజర్ అశోక్‌ను ఆదేశించారు.



అపరిశుభ్రంగా మారిన స్టేషన్ ఆవరణ

నిర్వహణ కష్టంగా మారింది.. : అశోక్‌కుమార్, స్టేషన్ మేనేజర్

స్టేషన్‌లో ప్రయాణికులకు పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించడం కష్టతరంగా మారింది. పనులు జరుగుతుండంతో ప్రయాణి కులకు ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయి. విశ్రాంతి గదుల్లో ఉన్న సామగ్రిని గుర్తు తెలియని ఆకతాయిలు ధ్వంసం చేశారు. వీలైనంత త్వరగా నిర్మాణాలు పూర్తి చేసి పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పిస్తాం. ప్రయాణికులు అధికారులకు సహకరించాలి.



ఆర్టీసీ బస్సు ఢీ.. హోంగార్డు మృతి

విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా ప్రమాదం



బైకును ఢీకొన్న ఆర్టీసీబస్సు



హోంగార్డు నాగప్ప(ఫైల్)

ధర్మవరం రూరల్/ చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 6: ఆర్టీసీ బస్సు ఢీకొని హోంగార్డు దుర్మరణం చెందారు. కనగానపల్లి పోలీసులు తెలపిన వివరాల మేరకు మండలంలోని యలకుంట్ల క్రాస్ వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొని హోంగార్డు దుర్మరణం చెందిన సంఘటన మంగళవారం తెల్లవారు జామున జరిగింది. చెన్నేకొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న హోంగార్డు వీ.నాగప్ప(40) సోమవారం రాత్రి మండలంలోని తూంచర్ల లో జరుగుతున్న దేవర ఉత్సవాలకు బందోబస్తుకు వెళ్లారు. విధులు ముగించుకుని తెల్లవారుజామున తన ద్విచక్రవాహనంలో ధర్మవరం వైపు వస్తున్నారు. ధర్మవరం వైపు నుంచి వేపకుంటకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు యల్లకుంట్ల క్రాస్ వద్ద ముందు వెళ్తున్న ఎద్దులబండిని తప్పించబోయి ఎదురుగా వస్తు న్న ద్విచక్రవాహనాన్ని వేగంగా ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనంతో పాటు బస్సుకింద పడ్డ హోంగార్డు నాగప్ప తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడిక్కడే కన్ను మూశారు. మృతుడికి భార్య యశోదతో పాటు ముగ్గురు కుమారులు ఉన్నారు. మృతుడి స్వగ్రామమైన మేడాపురం గ్రామస్థులు, బంధువులు అక్కడికి చేరుకుని బోరున విలపించారు. ఈ వి షయం తెలుసుకున్న కనగానపల్లి ఎస్ఐ మల్లికార్జునరెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నాగప్ప మృతిపై తోటి సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

డీఎస్పీ నివాళి

హోంగార్డు అకాలంగా మృతి చెందడం బాధాకరమని ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు పేర్కొన్నారు. రోడ్డు ప్రమాద విషయం తెలుసుకున్న ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు మృతుడి స్వగ్రామమైన మేడాపురం వెళ్లి భౌతిక కాయానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం కుటుంబసభ్యులకు రూ.25 వేలు ఆర్థికసాయం అందించారు. ఉన్నతాధికారుల దృష్టికితీసుకెళ్లి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నివాళులర్పించిన వారి లో ఎస్ఐ శ్రీదర్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఎంబీఏ, ఎంసీఏ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 6: జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంబీఏ, ఎంసీఏ పరీక్షల ఫలితాలు మంగళవారం విడుదల చేశామని డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ కేశవరెడ్డి, సీఈ ప్రొఫెసర్ చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. ఎంసీఏ తృతీయ సెమిస్టర్(ఆర్20) రెగ్యులర్, సప్లమెంటరీ పరీక్షలతో పాటు ఎంబీఏ తృతీయ సెమిస్టర్(ఆర్21), నాల్గవ సెమిస్టర్(ఆర్21,17) ఎంసీఏ తృతీయ, నాల్గవ సెమిస్టర్(ఆర్20,17), ఐదవ సెమిస్టర్(ఆర్17) పరీక్షలను నిర్వహించారు. ఫలితాలకోసం www.jntua.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

యువకుడి ఆత్మహత్య



రంజిత్ (ఫైల్)

పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 6: ప్రేమించిన యువతి దక్కలేదని రంజిత్ (24) అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు పుట్టపర్తి మండలం వీరాంజినేయపల్లిలో మంగళవారం వీరాంజినేయలపల్లికి చెందిన నారాయణ పెద్దకుమారుడు రంజిత్ పుట్టపర్తిలో వెల్డింగ్ పనిచేసుకుని జీవనం సాగించే వాడు. ఈ క్రమంలో ఓయువతిని ప్రేమించాడు. ఐతే యువతి తల్లిదండ్రులు ప్రేమను అంగీకరించలేదనే మనస్థాపంతో మంగళవారం తెల్లవారుజామున ఇంట్లో ఫ్యాన్‌కు తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. తెల్లవారుజామున ఎంతటికీ తలుపు తెరవకపోవడంతో తండ్రి అనుమానంతో తలుపులు పగులకొట్టి చూడగా రంజిత్ ఫ్యానుకు వేలాడుతూ కనిపించాడు. స మాచారం అందుకున్న రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆలయ భూములనూ అమ్మేశారు..

- నకిలీ పట్టాలు సృష్టించిన వైసీపీ నాయకులు
- ఇంటి నిర్మాణానికి అనుమతినిచ్చిన రెవెన్యూ అధికారులు

ఉరవకొండ, ఫిబ్రవరి 6: వైసీపీ నాయకులు ఆలయ భూములనూ వదలకుండా కబ్జా చేశారు. పట్టణంలోని సర్వే నెంబర్ 563లోని వీరభద్రస్వామి ఆలయ భూమికి నకిలీ పట్టాలను సృష్టించి, అమాయకుల్ని నమ్మించి, పాట్లు విక్రయించి సొమ్ము చేసుకున్నారు. పట్టాల్లో కూడా వేరే సర్వే నెంబర్‌ను పొందుపరిచి, సర్వే నెంబర్ 563లో స్థలాలను చూపించారు. ఇప్పటికే ఆ భూమిలో 20మంది దాకా ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. హౌసింగ్ అధికారులు సైతం ఆ భూములకు ఇళ్లు మంజూరు చేయడం ఆశ్చర్యమే. పంచాయతీ అధికారులు ఇళ్ల నిర్మాణాలకు అనుమతులివ్వడం కొసమెరుపు. ఇదే కాకుండా సర్వే నెంబర్ 564లో పంచాయతీ ప్రజల కోసం కేటాయించిన స్థలంపై వైసీపీ నాయకులు కన్నేసినట్లు తెలుస్తోంది. ఆ స్థలం జాతీయ రహదారికి ఆనుకుని ఉండటంతో సెంటు రూ.10లక్షల దాకా పలుకుతోంది. పంచాయతీ స్థలాలు అన్యాక్రాంతమవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



దేవాలయభూమిలో నిర్మించిన ఇల్లు

అమ్మేసిన పంచాయతీ స్థలం ఇదే

పంచాయతీ స్థలం రిజిస్ట్రేషన్

ఉరవకొండ మేజర్ పంచాయతీ పరిధిలో ప్రజా ప్రయోజనాల కోసం వదిలిన స్థలాన్ని విక్రయించి, ఏకంగా రిజిస్ట్రేషన్ చే యించారు. ఉరవకొండలోని సర్వే నెంబర్ 598-బీలో పంచాయతీకి చెందిన స్థలం ఉంది. అందులో 3.75సెంట్లు కలిగిన ప్లాట్ తమదేనంటూ 2014లో విడపనకల్లు మండలం ఆర్. కొట్టాలకు చెందిన ఓ మహిళకు విక్రయించారు. దీనికి మ ధ్యవర్తిగా వైసీపీకి చెందిన వ్యక్తి వ్యవహరించారు. ఆ స్థలాన్ని రూ.4.80 లక్షలకు అమ్మి ఆ మహిళ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించారు. కొన్నాళ్ల తర్వాత కొనుగోలు చేసిన మహిళ స్థలం వద్దకు వెళ్లగా పంచాయతీ స్థలం అని తేలింది. దీంతో తమకు డబ్బులు తిరిగి ఇవ్వాలని లేదా స్థలం చూపించాలని వారిని అడిగారు. పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశారు. 10నెలలైనా రిజిస్ట్రేషన్ ఆఫీ సులో తొలగించలేదు. పంచాయతీ అధికారులు బోర్డులు పెట్టి చేతులు దులుపుకున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి గౌస్‌ను వివరణ కోరగా అమ్మిన, కొనుగోలు చేసిన వారికి త్వరలోనే నోటీసులు పంపుతామని తెలిపారు.

రాయలసీమకు తీరని అన్యాయం

- ప్రత్యేక నిధులు కేటాయించి ప్రాజెక్టులను పూర్తి చేయాలి : సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి6 : రాయలసీమకు ఇచ్చిన ఏ హామీని నెరవేర్చకుండా ఆ ప్రాంత ప్రజలకు సీఎం జగన్ తీరని అన్యాయం చేస్తున్నారని రా యలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి మండిపడ్డారు. మంగళవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో జలసాధన సమితి ఆధ్వర్యంలో పలు రాజకీయ, రైతు సంఘాలతో చర్చావేదిక నిర్వహించారు. జలసాధన సమితి అధ్యక్షుడు రామ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన చర్చావేదికలో బొజ్జా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ.. సీఎం జగన్ ఆమోదించి, ప్రారంభించిన హంద్రీనీవా కాలువ వెడల్పు, తోపుదుర్తి, ముట్టాల, దేవరకొండ రిజర్వాయర్లు, పుట్టపర్తిలోని 193 చెరువులు ముదిగుబ్బ మండలం జిల్లేడు బండ ప్రాజెక్టు, మడకశిర బ్రాంచ్ కెనాల్ బైపాస్ కెనాలు, మడకశిర నియోజకవర్గంలో కాలువ పనులు పూర్తీ చేయడానికి రూ. 8709 కోట్లు ఖర్చవుతోంది. అయితే 2023-24 బడ్జెట్‌లో కేవలం హంద్రీనీవాకు రూ. 122.69 కోట్లు కేటాయించి అన్యాయం చేశారన్నారు. ఈ బడ్జెట్‌తో ప్రాజెక్టులను ఏ విధంగా పూర్తి చేస్తారో సమాధానం చెప్పాలన్నారు. రాయలసీమ ప్రాజెక్టులకు బడ్జెట్‌లో అతి తక్కువ కేటాయింపులు చేయడం, కోస్తాంధ్ర ప్రాంతానికి అధిక కేటాయింపు చేయడంలో సమన్యాయం ఎక్కడుందో చెప్పాలని ప్రశ్నించారు. జగన్ అధికారంలోకి వచ్చాక హంద్రీనీవా కాలువ పనులు ఎక్కడివక్కడ ఆగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు ప్రారంభించిన పేరూరు, భైరవానితిప్ప ప్రాజెక్టులను రద్దు చేశారన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా కరువులు, వలసలు, రైతుల ఆత్మహత్యలతో అల్లాడిపోతుందన్నారు. ఈ పరిస్థితుల్లో సంక్షేమ పథకాలు ఉపశమనమే తప్ప.. శాశ్వత కరువు నివారణ పథకాలు కావన్నారు. ఉమ్మడి జిల్లా కరువు నివారణకు హంద్రీనీవా ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి బీడుపడిన భూములకు సాగునీరందించడమే పరిష్కారమన్నారు. జీఓ నెం 365తో హంద్రీనీవా, గాలేరునగరి, తెలుగుగంగ తదితర రాయలసీమ ప్రాజెక్టులలో దాదాపు కాలువలు, ప్యాకేజీలు 100కిపైగా రద్దు చేసి సీఎం జగన్ రాయలసీమకు తీరని అన్యాయం చేశారని మండిపడ్డారు. రైతులు కరువును గట్టెక్కాలంటే 2021లో పరిపాలన ఆమోదం పొందిన హంద్రీనీవా మెయిన్ కాలువను వెడల్పు చేయాలని, హంద్రీనీవా సమాంతర కాలువను నిర్మించి 6,02,500 ఎకరాల ఆయకట్టుకు పిల్ల కాలువల ద్వారా నీరందించాలన్నారు. తుంగభద్ర నది నుంచి సమాంతర కాలువ నిర్మించడంతో పాటు.. మండకశిర బ్రాంచ్ కెనాల్ వెడల్పు చేయాలన్నారు. రాయలసీమ ప్రాజెక్టులకు ప్రథమ ప్రాధాన్యమిస్తూ బడ్జెట్ కేటాయించా లన్నారు. బడ్జెట్‌లో రాయలసీమ ప్రాజెక్టులకు 50 శాతం ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. ఈ చర్చావేదికలో మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, హెచ్‌ఆర్‌ఎఫ్ నాయకులు చంద్రశేఖర్, ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, రచయిత బండి నారాయణస్వామి, ఇండ్ల ప్రభాకర్ రెడ్డి, రైతు సంఘం నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్సీఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బొజ్జా దశరథరామిరెడ్డి

వైసీపీ పాలనలో ఎస్టీలకు అన్యాయం


మాట్లాడుతున్న రమేష్ నాయక్

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 6: వైసీపీ పాలనలో ఎస్టీలకు తీరని అన్యాయం జరిగిందని టీడీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రమేష్ నాయక్ మండిప డ్డారు. మంగళవారం స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన టీడీపీ ఎస్టీ సెల్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోవు నెల రోజులపాటు ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో గిరిజన గ్రామాల్లో పర్యటిస్తామని, టీడీపీ హయాంలో ఎస్టీలకు అందించిన సంక్షేమ ఫలాలు, వైసీపీ పాలనలో జరిగిన అన్యాయంపై వివరించి చైతన్యం నింపుతామని అన్నారు. చంద్రబాబు మళ్లీ సీఎం అయితేనే అన్ని వర్గాలకూ న్యాయం జరుగుతుందన్నారు. ఎస్టీలంతా ఏకమై రాబోవు ఎన్నికల్లో వైసీపీకి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ నాయకులు శంకర్, మనోహర్, హనుమాన్ నాయక్, గంపన్న, రామస్వామి, అంజి, సురేష్, శ్రీనివాస్, మల్లికార్జున, సత్యనారాయణ, నాగేంద్ర పాల్గొన్నారు.

ముస్లిం, మైనార్టీలకు వైసీపీ మోసం

టీడీపీ మైనార్టీ సెల్ నగర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ అజీజ్


మాట్లాడుతున్న టీడీపీ మైనార్టీ నాయకులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 6: వైసీపీ ప్రభుత్వం ముస్లిం, మైనార్టీలకు మాటలు చెప్పి నిట్టనిలువునా మోసం చేసిందని టీడీపీ మైనార్టీ నగర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ అజీజ్ మండిపడ్డారు. మంగళవారం ఆయన ప్రెస్‌క్లబ్ లో మాట్లాడుతూ... రాజకీయంగా, ఆర్థికంగా వెనుకబడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముస్లిం,మైనార్టీలను ఓటుబ్యాంకు చూస్తున్నారే తప్పా.. రాజకీయ ప్రాధాన్యత కల్పించడం లేదన్నారు. రానున్న ఎన్నికల్లో తాను అనంతపురం ఎంపీగా పోటీచేసేందుకు సిద్ధంగా ఉన్నానని, టీడీపీ తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని కోరారు. త్వరలో అన్ని వర్గాలతో బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమావేశంలో పలువురు ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

'అసెంబ్లీ ముట్టడి' విజయవంతం : డేగల


నల్లపాడు పోలీసు స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న సర్పంచ్‌లు, నాయకులు

శింగనమల, ఫిబ్రవరి 6: సర్పంచ్‌ల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ సభ్యులు, సర్పంచ్‌లు చేపట్టిన 'అసెంబ్లీ ముట్టడి' కార్యక్రమం విజయవంతం అయ్యిందని, అసెంబ్లీ గేటు తాకి పంతం నెగ్గించుకున్నామని రాష్ట్ర పంచాయతీ రాజ్ ఛాంబర్ కార్యనిర్వాహక కార్యదర్శి డేగల కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం సర్పంచ్‌ల సమస్యలపై పంచాయతీరాజ్ జాతీయ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ పిలుపు మేరకు డేగల కృష్ణమూర్తి, పెద్ద ఎత్తున సర్పంచ్‌లు అసెంబ్లీ వద్దకు చేరుకున్నారని, చాంబర్ సభ్యులను బలవంతంగా అరెస్టు చేసి నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు తరలించారని తెలిపారు. ఇలాంటి అరెస్టులు సర్పంచుల ఉద్యమాన్ని ఆపలేవని, తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చకపోగా, ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణి పాటిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పౌరసరఫరాల డీఎంగా రమేష్‌రెడ్డి

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 6: అనంత జిల్లా పౌరసరఫరాలశాఖ డీఎంగా రమేష్‌రెడ్డిని నియమించారు. మంగళవారం పలువురు డిప్యూటీ కలెక్టర్లను ప్రభుత్వం బదిలీ చేసింది. ఇందులో జిల్లాకు పౌరసరఫరాలశాఖ డీఎంగా రమేష్‌రెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఇక్కడ డీఎంగా రవీంద్ర ఉన్నారు. ఆయన ఈ జూన్‌లో ఉద్యోగ విరమణ అవుతున్నారు. ఆయన ఎన్నికల విధులకు దూరంగా ఉంటారు. కాబట్టి ఎన్నికల నిబంధనలు ఆయనకు వర్తించవు. దీంతో ఉద్యోగ విరమణ వరకూ రవీంద్ర ఇక్కడే ఉంటారని అందరూ భావించారు. అయితే డీఎంగా రమేష్‌రెడ్డిని ప్రభుత్వం ఇక్కడికి బదిలీ చేసింది. దీనిపై ఆశాఖాధికారులను అడగ్గా... రవీంద్ర బదిలీ కాలేదని, పొరపాటున జీపీడీలో మరొకరిని నియమించినట్లు పేరు వచ్చిందని, అది రద్దు అవుతుందని తెలిపారు. ఇదిలా ఉండగా హెచ్ఎన్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా వెన్నెల శ్రీనును నియమిస్తూ అధికారికంగా ఉత్తర్వులు వచ్చాయి.

ముంటిమడుగు ఆర్థిక సాయం

గార్లదిన్నె, ఫిబ్రవరి 6: మండలంలోని పాతకల్లూరుకు చెందిన మాజీ ఎంపీటీసీ నాగమ్మ కుమారుడు సాంబశివ రెండు రోజుల క్రితం గుర్తుతెలియని వాహనం ఢీ కొని మరణించాడు. శింగనమల టీడీపీ నియోజకవర్గం ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి బాధిత కుటుంబానికి స్థానిక టీడీపీ నాయకులతో రూ. 10వేల సాయం అందజేశారు.

ఆశావర్కర్లకు గోనుగుంట్ల విరాళం



అనంతపురం సెంట్రల్ : ఆశావర్కర్ల యూనియన్ నాయకులకు ధర్మవరం మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ మంగళవారం స్థానిక తన నివాసంలో రూ.50 వేలు అందించారు. చలో విజయవాడ కార్యక్రమానికి తరలి వెళ్తున్న ఆశావర్కర్లకు తనవంతుగా ఈ ఆర్థికసాయం చేసినట్లు తెలిపారు.

డ్రిప్ సరఫరాను వేగవంతం చేయండి

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 6: త్వరలో ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తున్న నేపథ్యంలో ఇప్పటి వరకు డ్రిప్ మంజూరైన రైతులకు పరికరాల సరఫరాను మరింత వేగవంతం చేయాలని ఏపీఎంఐపీ పీడీ హరినాథ్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం గుంటూరు నుంచి అన్ని జిల్లాల ఏపీఎంఐపీ పీడీలు, సిబ్బంది, డ్రిప్ కంపెనీ ప్రతినిధులతో ఆయన వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి మంజూరు మేరకు డ్రిప్ సరఫరా పెండింగ్‌లో పెట్టకూడదన్నారు. ఈ విషయంలో ఎవరు నిర్లక్ష్యం వహించకూడదన్నారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్‌ఖాన్, సిబ్బంది, డ్రిప్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేటి నుంచి మాసూద్ గాజి ఉరుసు

శింగనమల, ఫిబ్రవరి 6: శింగనమలలో హజ్రత్ సయ్యద్ సాలార్ మాసూద్ గాజి ఉరుసు బుధవారం నుంచి నిర్వహిస్తున్నట్లు దర్గా ముత్తవల్లి అబ్దుల్ రవూఫ్ తెలిపారు. బుధవారం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు, రాత్రిస్వామి వారి గంధం కార్యక్రమం రాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజామున వరకు నిర్వహిస్తామని తెలిపారు. గురువారం ఉరుసు, శుక్రవారం జియారత్ కార్యక్రమం ఉంటుందన్నారు.

పంట రుణాలను రెన్యువల్ చేసుకోండి

రామగిరి, ఫిబ్రవరి 6: రామగిరిలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో పంట రుణాలు తీసుకున్న రైతులు వాటిని రెన్యువల్ చేసుకోవాలని సొసైటీ సిబ్బంది నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు వారి ఆధార్, రేషన్‌కార్డు, 1బీ, నాలుగు ఫొటోలు తీసుకుని వచ్చి పంట రుణాలను రెన్యువల్ చేసుకోవాలన్నారు.

రైతులకు మెరుగైన సేవలు అందించండి

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 6: వ్యవసాయ అధికారులు సమన్వయంతో పనిచేసి కరువు జిల్లా రైతులకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ గౌతమి సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లా వ్యవసాయ అధికారుల సంఘం 2024-25 డైరీని ఆవిష్కరించిన ఆమె మాట్లాడారు. వ్యవసాయ ఉద్యోగులకు సమస్యలుంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అలాగే ఆ క్యాలెండర్‌ను జేసీ కేతన్‌గార్గ్ కూడా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరాముడు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటకుమార్, కమిటీ సభ్యులు సోమశేఖర్, శ్యాంసుందర్, చిన్నమ్మ, యల్లప్ప, రాకేష్ పాల్గొన్నారు.


డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్

రేషన్ బియ్యం పట్టివేత.. వైసీపీ నాయకుడిపై కేసు


తరిమెలలో రేషన్ బియ్యాన్ని సీజ్ చేసిన విజిలెన్స్ అధికారులు

అనంతపురం న్యూటౌన్, రూరల్ / శింగనమల, ఫిబ్రవరి 6: శింగనమల మండలంలోని తరిమెల గ్రామంలో వైసీపీ నాయకుడు అక్రమంగా సేకరించిన 60 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. తరిమెలలో వైసీపీ వార్డు మెంబర్ భర్త సాకే రామయ్య ఈ రేషన్ బియ్యాన్ని రేషన్‌దారుల నుంచి తక్కువ రేటుకు కొని.. బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న అధికారులు ఈ దాడులు నిర్వహించారు. సాకే రామయ్యపై కేసు నమోదు చేశారు. ఆ బియ్యాన్ని సీఎస్‌డీటీ రాజశేఖర్‌కు అప్పగించారు. ఈ దాడుల్లో ఏఈఈ రాజశేఖర్, విజిలెన్స్ సీఐ సాయిప్రసాద్, గ్రామ వీఆర్‌ఓ నవీన్ కుమార్ పాల్గొన్నారు.

అలాగే బుక్కరాయసముద్రం మండలం కొట్టాలపల్లిలో సునీత, భద్రంపల్లిలో ప్రసన్న వందన, ఆకుతోటపల్లిలో హేమలత, మన్నీలలో సరోజమ్మకు చెందిన రేషన్ దుకాణాలనూ అధికారులు తనిఖీ చేశారు. అన్ని రికార్డులు సరిగా ఉన్నట్లు సీఐ రామారావు తెలిపారు. ఈ తనిఖీల్లో డీఈఈ యోగేష్‌బాబు, ఏఓ వాసుప్రకాస్, ఏఈఈ రవీంద్రనాథ్, ఏజీ శివప్రసాద్ పాల్గొన్నారు.

మహిళ హత్య కేసులో ఒకరి అరెస్టు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 6: నార్పల మండలం బొందలవాడలో మూడు రోజుల క్రితం జరిగిన లక్ష్మీనారాయణమ్మ హత్య కేసును శింగనమల సర్కిల్ పోలీసులు ఛేదించినట్లు స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ఏఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. నార్పల మండలం పప్పూరుకు చెందిన చల్లా నరేంద్రను అరెస్ట్ చేశామన్నారు. ఏఎస్పీ తెలిపిన వివరాల మేరకు.. బీకాం చదివిన చల్లా నరేంద్ర ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాడు. ఈ మధ్యకాలంలో అతను షేర్‌మార్కెట్‌లో పెద్ద మొత్తంలో డబ్బు నష్టపోయాడు. సుమారు రూ.5 లక్షల వరకు అప్పులు చేశాడు. దీంతో నేరాలు చేసి డబ్బులు సంపాదించేందుకు సిద్ధపడ్డాడు. ఈ నెల ఒకటిన అరటితోటలోకి ఒంటరిగా వెళ్లిన నారాయణమ్మ మెడలో బంగారు గొలుసును లాక్కోవడానికి నరేంద్ర ప్రయత్నించాడు. ఆమె గట్టిగా అరవడంతో నరేంద్ర పదునైన రాయితో ఆమె తలపై బలంగా కొట్టి చంపాడు. ఆమె ధరించిన బంగారు గొలుసు, ఇత్తడి ఉంగరం, ఇత్తడి గాజు, సెల్‌ఫోన్ తీసుకుని.. మృతదేహాన్ని రెండడుగుల గుంత తీసి పూడ్చాడు. రెండురోజుల తర్వాత మృతదేహం కుళ్లి వాసన రావడంతో హత్య విషయం వెలుగు చూసింది. హత్యకేసు ఛేదించిన పోలీస్ అధికారులను ఎస్పీ అన్బురాజన్ అభినందించారు.

పీహెచ్‌సీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం

అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత



వైద్యులతో మాట్లాడుతున్న అడిషనల్ డీఎంహెచ్ఓ

గార్లదిన్నె, ఫిబ్రవరి 6: యర్రగుంట్ల ప్రాథమిక ఆరోగ్య (పీహెచ్‌సీ) కేంద్రం ఏర్పాటుపై చర్యలు తీసుకుంటామని అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని డీపీఎం రవిశంకర్, 104 జిల్లా మేనేజర్ కృష్ణమూర్తితో కలిసి ఆమె పరిశీలించారు. పేపర్లలోనే పీహెచ్‌సీ అనే శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై వైద్యాధికారి గౌతమి, సంబంధిత వైద్యులతో చర్చించారు. యర్రగుంట్ల పీహెచ్‌సీ కేంద్రం ఏర్పాటుకు ఉన్నతాధికారులతో చర్చిస్తామన్నారు. ఇలాంటి పీహెచ్‌సీలు జిల్లాలో ఐదు వరకు ఉన్నాయన్నారు.

టీడీపీ కార్యకర్తకు పరామర్శ

అనంతపురంరూరల్ : మండలంలోని ఇటుకలపల్లి గ్రామం పరిటాల రవీంద్ర కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్త నరసింహులు రోడ్డు ప్రమాదంలో సోమవారం గాయపడ్డారు. మంగళవారం ఆ గ్రామానికి వెళ్లిన మండల కన్వీనర్ జింకాసూర్యనారాయణ, సత్యసాయి జిల్లా కుమ్మరసాధికార కమిటీ కన్వీనర్ రామాంజినేయులు, టీడీపీ నాయకులు రవీంద్ర, తిమ్మప్ప, మాధవరాజు అతన్ని పరామర్శించారు.

జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థినులు

రాప్తాడు, ఫిబ్రవరి 6: రాప్తాడు ఉన్నత పాఠశాల విద్యార్థినులు అంజలి, భవిత, నవ్యశ్రీ జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం నరసింహులు, పీడీ కేశవమూర్తి తెలిపారు. వారిని పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు.

పంట రుణాల పరిమితికి ప్రతిపాదనలు


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 6: పంట రుణాల పరిమితికి సంబంధించి రాష్ట్ర ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు వ్యవసాయ శాఖ జేడీ ఉమామహేశ్వరి తెలిపారు. మంగళవారం స్థానిక ఎన్టీఆర్ సహకారభవన్‌లో జిల్లాస్థాయి సాంకేతిక కమిటీ సమావేశం నిర్వహించారు. జేడీ మాట్లాడుతూ.. 2024-25 సంవత్సరానికి సంబంధించి వివిధ పంట రుణాలపై బ్యాంకులు అందించే రుణపరిమితి ప్రతిపాదనలు రాష్ట్రస్థాయి కమిటీ ఆమోదానికి పంపినట్లు తెలిపారు. రైతులకు అనుకూలంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ వర్తింపచేస్తామని పేర్కొన్నారు. ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు అభివృద్ధికి చేస్తున్న కృషిలో తమ బ్యాంకు భాగస్వామిగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం అనురాధా, ఏడీసీసీ బ్యాంకు సీఈఓ రాంప్రసాద్, జనరల్ మేనేజర్ సురేఖరాణి, డీజీఎం సుఖదేవబాబు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

9 నుంచి ఆడుదాం ఆంధ్రా రాష్ట్రస్థాయి పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్ : ఆడుదాం ఆంధ్రా రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు శుక్రవారం నుంచి మంగళవారం విశాఖపట్నంలో నిర్వహిస్తున్నట్లు డీఎస్‌డీఓ నరసింహారెడ్డి తెలిపారు. ఈ పోటీలకు కబడ్డీ 12 మంది, ఖో ఖో 12, క్రికెట్ 16, వాలీబాల్ 12, బ్యాడ్మింటన్ ఇద్దరు పురుషులు, మహిళల జట్లు మొత్తంగా 106 మంది క్రీడాకారులు, 14 మంది కోచ్‌లు విశాఖపట్నానికి వెళ్లినట్లు తెలిపారు.

బాధ్యతల స్వీకరణ

రామగిరి, ఫిబ్రవరి 6: రామగిరి మండల ఎస్ఐగా వెంకటేశ్వర్లు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన అమరాపురంలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ జనార్దన్‌నాయుడు పుట్టపర్తి క్రైంస్టేషన్‌కు బదిలీ అయ్యారు. జనార్దన్‌నాయుడికి పోలీసులు సన్మానించి వీడ్కోలు పలికారు.

చెన్నేకొత్తపల్లి : చెన్నేకొత్తపల్లి మండల తహసీల్దార్‌గా హమీద్‌బాషా మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గాండ్లపెంట తహసీల్దార్‌గా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడి తహసీల్దార్ షాబుద్దీన్ చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు.

ఆత్మకూరు : మండల తహసీల్దార్‌గా పరమేశ్వరస్వామి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన తిరుపతి జిల్లా పుత్తూరు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడి తహసీల్దార్ షర్మిల కర్నూలు జిల్లాకు బదిలీ అయ్యారు.

ఆలయ వార్షికోత్సవం


కుంటెమ్మ దేవత అలంకరణ

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 6 : స్థానిక అంబేడ్కర్ నగర్‌లోని కుంటెమ్మ దేవాలయ తొమ్మిదవ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు,ప్రత్యేక అలంకరణలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రామాంజనేయులు, ఉపాధ్యక్షుడు శేకర్‌బాబు, శ్రీరాములు, పెద్దబాబు, భక్తులు పాల్గొన్నారు.

తూంచర్లలో ఘనంగా పెద్దమ్మ తల్లి దేవర


పెద్దమ్మ తల్లి

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 6: కనగానపల్లి మండలం తూంచర్ల గ్రామంలో మంగళవారం పెద్దమ్మస్వామి ఊరిదేవరను గ్రామపెద్దలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని పెద్దమ్మ, నల్లలమ్మ గ్రామ దేవతలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారజామునే అమ్మవార్లకు బలితర్పణం చేసి గ్రామంలో పొలివేశారు. గ్రామంలోని ప్రతి ఇంటి వద్ద విందుభోజనాలు ఏర్పాటు చేశారు. ఈ ఊరిదేవరలో పాల్గొనేందుకు చుట్టుపక్కన ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు


సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

ఆత్మకూరు ఫిబ్రవరి 6 : మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో స్వామి వారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పాలాభిషేకం, పంచామృత అభిషేకం, అలంకరణ, ఆకుపూజ, అర్చన, మహానైవేద్యం, మహామంగళ హారతి తదితర వాటిని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

ఆశావర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



డీఎంహెచ్ఓకు వినతిపత్రం ఇస్తున్న నేతలు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 6: రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ సంఘం జిల్లా కార్యదర్శి రాజారెడ్డి, నాయకులు డీఎంహెచ్ఓ ఈ.బీ.దేవికి ఆమె కార్యాలయంలో మంగళవారం వినతి పత్రం అందజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారితో వెట్టిచాకిరీ చేయిస్తున్నారని రాజారెడ్డి మండిపడ్డారు. ఆశా వర్కర్లకు సంబంధం లేని పనులు కూడా చేయిస్తున్నారని, అధికారుల వేధింపులు కూడా ఎక్కువయ్యాయని అన్నారు. ఒక వైపు రాజకీయ వేధింపులు, మరో వైపు అధికారులు ఆన్‌లైన్‌లో వివరాల నమోదు, రికార్డులు ఇలా అనేక పనులు చేయిస్తున్నారని మండిపడ్డారు. వారిపై పనిభారం తగ్గించాలని కోరారు. జిల్లాలో నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉంచిన టీబీ, లెప్రసీ బకాయిలు చెల్లించాలన్నారు. వర్కర్లకు నాణ్యమైన యూనిఫామ్స్ అందించాలని, సుప్రీం కోర్టు తీర్పు మేరకు రూ. 26 వేల కనీస వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు పాల్గొన్నారు.

మహాగర్జనను జయప్రదం చేయండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 6: కర్నూలులోని మున్సిపల్ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహిస్తున్న ముస్లిం,మైనార్టీ హక్కుల మహాగర్జనను జయప్రదం చేయాలని ఐఎంఎం ఆర్గనైజేష్ వ్యవస్థాపక అధ్యక్షుడు మహబూబ్ బాష పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఆ సంఘం కార్యాయలంలో మహాగర్జనకు సంబంధించిన ఆహ్వానపత్రికను పలువురు ముస్లిం, మైనార్టీ సంఘాల నేతలకు అందజేసిన ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా అన్యాక్రాంతమైన ముస్లిం, మైనార్టీలకు చెందిన వక్ఫ్‌బోర్డు ఆస్తులు పరిరక్షణకు ఐకమత్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ముస్లిం, మైనార్టీ రాష్ట్ర నేతలు మహబూబ్ బాషా, సిరాజ్ బ్రదర్, ఎంఐఎం పార్టీ నాయకులు దాదు, టిప్పు సుల్తాన్ అభిమాన సంఘం అధ్యక్షుడు జాకీర్, నాయకులు షబ్బీర్ బాషా, మసూద్ వలి, ముక్తియార్, నూర్ మహమ్మద్, షేక్షావలి, ఒసామా పాల్గొన్నారు.

జగన్‌కు ముదిరిన ప్రచార పిచ్చి : జనసేన

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 6: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ప్రచార పిచ్చి బాగా ముదిరిందని, ఎక్కడ చూసినా తన ఫొటోనే కనిపించాలని ఓ నియంతలా వ్యవహరిస్తున్నాడని జనసేన రాయలసీమ రీజనల్ ఉమెన్ కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత ధ్వజమెత్తారు. మంగళవారం అనంతపురం రూరల్ పంచాయతీ నారాలోకేష్ కాలనీలో మాటామంతి కార్యక్రమాన్ని నిర్వహించిన ఆమె మాట్లాడారు. జగన్‌రెడ్డి ప్రచార ఖర్చుతో ఒక జిల్లాను అన్ని రంగాల్లో పూర్తిగా అభివృద్ధి చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర ప్రధాన కార్యదర్శి చక్రపాణి, టీడీపీ రూరల్ పంచాయతీ ఇన్‌చార్జ్ కేశవ, నాయకులు రమణ, వేణుగోపాల్, వీర మహిళలు కళ్యాణి, సుమలత, శైలజా, గురులక్ష్మి, సరోజమ్మ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించకుంటే రాజీనామా చేస్తా

ట్యాంకు ఎదుట వైసీపీ కార్పొరేటర్ చంద్రమోహన్‌రెడ్డి నిరసన


మాట్లాడుతున్న వైసీపీ కార్పొరేటర్ చంద్రమోహన్‌రెడ్డి

అనంతపురం క్రైం: నగరంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, సమస్యను వెంటనే పరిష్కరించుకుంటే తాను రాజీనామా చేస్తానని 45వ డివిజన్ కార్పొరేటర్ చంద్ర మోహన్‌రెడ్డి తేల్చిచెప్పారు. మంగళవారం తన డివిజన్ పరిధిలోని ట్యాంకు ఎదుట స్థానికులతో కలిసి చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ప్రజలు తమను ప్రశ్నిస్తుంటే సమాధానం చెప్పలేకపో తున్నామని, మేయర్, డిప్యూటీ మేయర్లు స్పందించాలని డిమాండ్ చేశారు.

అవయవ దానంపై అవగాహన

అనంతపురం సెంట్రల్: అవయవదానంపై అవగాహన సదస్సును ఎస్కేయూ ఫార్మసీ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. ఇందులో అఖిల భారత శరీర అవయవదాన సంఘం అధ్యక్షురాలు సీతా మహాలక్ష్మి మాట్లాడుతూ.. ఆరోగ్యంగా మృతిచెందిన వారి అవయవాలను దానం చేయడం ద్వారా బాధితులకు జీవితాన్ని ప్రసాదించవచ్చునన్నారు.

శ్రీనివాస ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ సేవలు పునఃప్రారంభం

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 6: స్థానిక సూర్యానగర్ ఐరన్ బ్రిడ్జ్ సమీపంలోని శ్రీనివాసా మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ కింద వైద్యసేవలు మళ్లీ ప్రారంభమయ్యాయని ఆ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాసరావు, డైరెక్టర్ డాక్టర్ రాఘవేంద్ర తెలిపారు. మంగళవారం వారు మీడియాతో మాట్లాడుతూ.. పది నెలల క్రితం కొన్ని కారణాలతో ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోయాయని, ప్రస్తుతం అధునాతన వసతులు, పరికరాలతో వివిధ వ్యాధులకు ఆపరేషన్లు చేయడానికి డాక్టర్లు, వసతులు ఏర్పాటు చేశామని అన్నారు. దీంతో ఆరోగ్యశ్రీ సేవలకు అనుమతిస్తూ మంగళవారం అధికారికంగా ఉత్తర్వులు వచ్చాయని, ఇకనుంచి ఇక్కడ ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా వైద్యసేవలు అందిస్తామని వారు తెలిపారు.

కబ్జాలు, దౌర్జన్యాల్లోనే వాళ్లు 'తోపులు' : టీడీపీ


మాట్లాడుతున్న శ్రీనివాసులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 6: తోపుదుర్తి సోదరుల కబ్జాలు, దౌర్జన్యాలతో రాప్తాడు నియోజకవర్గ ప్రజలు విసిగిపోయారని, ప్రజా సమస్యలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదని టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో వైసీపీని ఓడించి.. టీడీపీని గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... ఆ సోదరులు బీసీల భూములను కబ్జా చేసి.. రూ.కోట్ల గడించారని, వారిపైనే అక్రమ కేసులు బనాయించి అణగదొక్కుతున్నారని మండిపడ్డారు. నేడు ఎన్నికలు సమీపిస్తుండటంతో ఆ సోదరులు నేడు బీసీలపై ఎక్కడ లేని ప్రేమ చూపిస్తున్నారని, దీన్ని నమ్మే స్థితిలో ప్రజలు లేరని అన్నారు. ఈ ఐదేళ్ల కాలంలో బీసీలకు నియోజకవర్గంలో కార్పొరేషన్‌లు ద్వారా ఒక్క రూపాయి అయినా ఇచ్చారా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే తన సొంత మండలాన్ని అభివృద్ధి చేయడం అటుంచి... కనీసం అందులోని సమస్యలనూ పరిష్కరించలేకపోయారని విమర్శించారు. పరిటాల కుటుంబానికి రోజురోజుకు ఆదరణ పెరుగుతోందని, వైసీపీ నుంచి స్వచ్ఛందంగా వచ్చి టీడీపీలో చేరుతున్నారని, దీన్ని జీర్ణించుకోలేకే వైసీపీ నాయకులు లేనిపోని విమర్శలు చేస్తున్నారని అన్నారు.

వైసీపీ పతనం ఖాయం: బండారు శ్రావణిశ్రీ


నిదనవాడ గ్రామస్థులతో మాట్లాడుతున్న బండారు శ్రావణిశ్రీ

శింగనమల, ఫిబ్రవరి 6: రానున్న ఎన్నికల్లో వైసీపీ ఓటమి ఖాయమని శింగనమల నియోజకవర్గం టీడీపీ నాయకురాలు బండారు శ్రావణిశ్రీ అన్నారు. మంగళవారం మండలంలోని నిదనవాడలో టీడీపీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు అమృత, ఎం.లక్ష్మీదేవి, మాజీ జెడ్పీటీసీ షాలినిదొర, చింతబరిదొర, ఈశ్వరరెడ్డి, సుధీర్‌రెడ్డి విశ్వనాథ్‌రెడ్డి రాఘవరెడ్డి పొరాళ్ల రవీంద్ర, తిరుపాలు, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కౌసల్యకు 'స్వర్ణ నంది' జాతీయ పురస్కారం



అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 6: అనంతపురం నగరానికి చెందిన ఓం సంగీత నృత్య శిక్షణాలయం నాట్యాచార్యురాలు దేవర కొండ కౌసల్యకు 'స్వర్ణ నంది' జాతీయ పురస్కారం వరించినట్లు తెలుగు సంస్కృతి సాహితీసేవ ట్రస్టు వ్యవస్థాపకుడు డాక్టర్ మాచవరం గౌరీశంకర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలుగు సంస్కృతి సాహితీసేవ ట్రస్టు, ఆంధ్రప్రదేశ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 11న విజయవాడలోని విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపంలో కౌసల్యకు పురస్కారం అందజేసి సత్కరిస్తామని తెలిపారు.

విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న జడ్పీ సీఈఓ నదియాదేవి

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 6: విశ్వకర్మ పథకాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని జడ్పీ సీఈఓ నదియాదేవి సూచించారు. మంగళవారం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకంపై అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వృత్తి పనులు చేసుకునే వారిని ప్రోత్సహించడం కోసమే ఈ పథకాన్ని ప్రవేశపెట్టామని, 18 రకాల కులవృత్తుల వారు ఐదుశాతం వడ్డీతో రూ.మూడు లక్షల వరకు రుణసదుపాయం పొందవచ్చని అన్నారు. ఈ పథకంపై క్షేత్ర స్థాయిలో విస్తృత ప్రచారం చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఎస్ఎంఈడీఐ అసిస్టెంట్ డైరెక్టర్ మూర్తి, పరిశ్రమల శాఖ జీఎం నాగరాజారావు, డీపీఓ ప్రభాకర్ రావు, డీఎల్‌డీఓ ఓబుళమ్మ, బ్యాంకర్లు, పరిశ్రమల శాఖ, సమ్మె సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నార్పల, ఫిబ్రవరి 6: గూగూడులోని కుళ్లాయిస్వామి దేవస్థానం ఆలయ ధర్మకర్తల నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈఓ ఎస్ శోభ మంగళవారం పేర్కొన్నారు. నూతన ధర్మకర్తల నియామకం కోసం దేవాదాయ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసిందని, ఆసక్తి ఉన్నవారు 20 రోజుల లోపు అనంతపురంలోని దేవదాయశాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జనసేనలో పలువురి చేరిక


వైసీపీ, కాంగ్రెస్ నేతలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న టీసీ వరుణ్

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 6: శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన పలువురు వైసీపీ, కాంగ్రెస్ నేతలు స్థానిక జనసేన కార్యాలయంలో మంగళవారం ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ మాట్లాడుతూ... రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిఒక్క కార్యకర్త.. ఓ సైనికుడిలా పనిచేసి టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి విజయానికి శక్తివంచనలేకుండా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కమ్మల నరేష్, కేవీ శివప్ప, డి. మహేష్ రెడ్డి, రాజా, హరి, శ్రీకాంత్, హరిప్రసాద్, సంపత్ పాల్గొన్నారు.

తెలుగుదేశంతోనే రాష్ట్రాభివృద్ధి

పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్



అంతరగంగ గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీలో పాల్గొన్న ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్

కూడేరు, ఫిబ్రవరి 6: తెలుగుదేశంపార్టీతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని అంతరగంగ, రామచంద్రాపురం, గొట్కూరు గ్రామాలలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఆయా గ్రామాలలో ఇంటింటికీ వెళ్లి తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టే సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. రామచంద్రాపురం గ్రామంలో టీడీపీ శ్రేణులు గజమాలతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆయనతో పాటు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, కురుగుంట బ్రహ్మయ్య, రామచంద్ర, రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహాశక్తి పథకంతో మహిళలకు పెద్దపీట

తెలుగుదేశంపార్టీ అధికారంలోకి రాగానే మహాశక్తి పథకం ద్వారా మహిళలకు పెద్దపీట వేస్తామని ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. మంగళవారం అంతరగంగ గ్రామంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమానికి వెళ్తుండగా కూలి పనులు ముగించుకుని వస్తున్న మహిళలు ఎదురుపడ్డారు. దీంతో ఆయన వారిని పలకరించారు. టీడీపీ ప్రవేశపెట్టే మహాశక్తి పథకం గురించి ఆయన వివరించారు. మహిళలు తెలుగుదేశంపార్టీకి అండగా నిలువాలని ఆయన కోరారు.

ప్రగతి జాడలేని జగన్ పాలన: కాలవ



టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలతో కాలవ

రాయదుర్గం, ఫిబ్రవరి 6: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనలో అరాచకం, విధ్వంసం తప్ప అభివృద్ధి జాడలు ఎక్కడా కనిపించడం లేదని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు విమర్శించారు. పట్టణంలోని 13వ వార్డులో వైసీపీకి చెందిన 30 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగన్‌రెడ్డి పాలనలో పెరిగిన నిత్యావసరాల ధరలతో పేద, మధ్యతరగతి కుటుంబాల జీవనాలు ఛిన్నాభిన్నం అయ్యాయన్నారు. బడుగు, వర్గాల ప్రజలు ఏమి తినలేని, కొనలేని దుస్థితికి వైసీపీ సర్కార్ తీసుకొచ్చిందన్నారు. జగన్ గెలిచాక తొమ్మిది సార్లు కరెంట్ చార్జీలను పెంచాడన్నారు. వంట గ్యాస్ ధరలు కూడా మూడింతలు పెరిగాయన్నారు. దుర్మార్గమైన జగన్‌మోహన్‌రెడ్డి పాలనను రాష్ట్రం నుండి తరిమి కొట్టడానికి టీడీపీ, జనసేన కూటమిలు అహర్నిశలు శ్రమిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, జనసేన ఇన్‌చార్జ్ మంజునాథ, నాగరాజునాయక్, ఏటూరు కుమార్, కురుబ ప్రహ్లాద, తమ్మన్న, కురుబ హనుమంతు, ప్రశాంతి, కడ్డిపుడి మహబూబ్‌బాషా, గాజుల వెంకటేశులు, పొరాళ్ల పురుషోత్తం, బండి భారతి, కేడిమి తిప్పేస్వామి పాల్గొన్నారు.

● మండలంలోని కొంతానపల్లి పంచాయతీ వైసీపీ ఉపసర్పంచ్ మారేష్ టీడీపీ పార్టీలోకి చేరారు. పట్టణంలోని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు నివాసంలో మంగళవారం ఈ చేరిక జరిగింది. కాలవ శ్రీనివాసులు ఆయనకు పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు.

టీడీపీతోనే బీసీల ఆర్థిక, రాజకీయ ఎదుగుదల: ఉమా



జయహో బీసీ సభలో ఐక్యత చాటుతున్న నాయకులు

కళ్యాణదుర్గం రూరల్, ఫిబ్రవరి 6: బీసీల ఆర్థిక, రాజకీయ ఎదుగుదల టీడీపీతోనే సాధ్యమని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఉమామహేశ్వరనాయుడు అన్నారు. జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఆవుల క్రిష్టయ్య అధ్యక్షతన జయహో బీసీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ భవన్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కార్యకర్తలు, ప్రజలతో కలిసి పట్టణంలోని పాత మార్కెట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జయహో బీసీ సభలో ఉమామహేశ్వరనాయుడు మాట్లాడుతూ దేశంలోనే బీసీలకు రాజకీయంగా ప్రాధాన్యం కల్పించి, అత్యున్నత పదవులు ఇచ్చిన ఘనత టీడీపీదే అన్నారు. వైసీపీ బీసీలను ఓటు బ్యాంక్‌గా వాడుకుని వారికి అన్ని విధాలుగా మొండి చేయి చూపిందని విమర్శించారు. వచ్చేది టీడీపీ ప్రభుత్వమేనని, కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని 114 చెరువుల కు నీరు తప్ప కుండా అందిస్తామన్నారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి ఉష శ్రీచరణ్ ని యోజకవర్గంలోని భూములను కొల్లగొట్టి అవి నీతి, అక్రమాలకు ఆజ్యం పోసిందని ఆరోపిం చారు. అయితే ప్రభుత్వ ప్రైవేట్ ఆస్తులను కాపాడటంలో టీడీపీ నియోజకవర్గ ఇన్ చార్జ్‌గా ఎప్పటికప్పుడు అడ్డుకట్ట వేశానన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు నాగేశ్వరయాదవ్, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర గాండ్ల సాధికారి త కమిటీ అధ్యక్షురాలు విశాలాక్షి, సాధికారిక కమిటీ సభ్యులు ఓబుళపతి, బ్యాళ్ల నాగేంద్ర, యాదవ్ సంఘం నాయకులు శేషు యాదవ్, పార్లమెంట్ కార్యదర్శి తలారి సత్తి, మండల ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, పట్టణ ప్రధాన కార్యదర్శి బిక్కీ గోవిందరాజులు, వాల్మీకి సంఘం నాయకులు పెదన్న, చౌడయ్య, మాజీ ఎంపీపీ మాధవి, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించుదాం

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 6: వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించుదామంటూ టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉన్నం హనుమంతరాయచౌదరి పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని ఉన్నం క్యాంప్ కార్యాలయంలో శెట్టూరు మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేయాలన్నారు. రాష్ట్రాన్ని అతలాకుతలం చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఇంటికి పంపించే రోజులు దగ్గరపడ్డాయన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా గెలిచేది టీడీపీనేనని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉన్నం మారుతీ చౌదరి, శెట్టూరు మండల నాయకులు పాల్గొన్నారు.

రాబోయేది టీడీపీ ప్రభుత్వమే



గజమాలతో అశ్మిత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న దృశ్యం

తాడిపత్రి, ఫిబ్రవరి 6: రాబోయే శాసనసభ ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించి అధికారం చేపడుతుందని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ జేసీ అశ్మిత్‌రెడ్డి ప్రజలకు భరోసా ఇచ్చారు. పట్టణంలోని నందలపాడులో 30వవార్డు కౌన్సిలర్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. టీడీపీ మినీ మేనిఫెస్టోలో పొందుపరిచిన పథకాలన్నింటిని అమలు చేస్తామన్నారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు. అంతకుమునుపు అశ్మిత్‌రెడ్డిని కౌన్సిలర్ విజయ్‌కుమార్ గజమాలతో స్వాగతించారు. వార్డులోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో భవిష్యత్తుకు గ్యారెంటీ



పెద్దొడ్డిలో కరపత్రం అందజేస్తున్న పత్తి హిమబిందు

గుత్తిరూరల్, ఫిబ్రవరి 6: మండలంలోని పూలకుంట, పెద్దొడ్డి గ్రామాలలో మంగళవారం టీడీపీ డాక్టర్స్ సెల్ జిల్లా అధ్యక్షురాలు పత్తి హిమబిందు బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. భవిష్యత్తుకు గ్యారెంటీ పథకాల గురించి మహిళలకు వివరించారు. గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణ, రవి, నరసింహులు కదిరెప్ప, చాగంటి గోవిందురాజులు, మనోహర్, జానికి, మాధవి, అరుణ, రాధ పాల్గొన్నారు.

మూడు నెలల వేతనాలు మంజూరు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విడపనకల్లు, ఫిబ్రవరి 6: సత్యసాయి తాగునీటి పథకంలో పని చేస్తున్న సీపీడబ్ల్యూఎస్ కార్మికులకు మూడు నెలల వేతనాలు మంజూరయ్యాయి. వేసవి కాదు వేతనం శీర్షికన మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. స్పందించిన అధికారులు మూడు నెలల వేతనాలు మంజూరు చేయడమే కాక మిగిలిన సొమ్ము రెండు వారాల్లో చెల్లిస్తామని హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు నిరసన దీక్షను విరమించి విధులకు హాజరయ్యారు. 9 గ్రామాలకు తాగు నీరు సరఫరా చేసేందుకు మోటార్లను ఆన్ చేశారు.

సైకో సీఎంను సాగనంపేందుకు సిద్ధంకండి

పామిడి, ఫిబ్రవరి 6: రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన సైకో సీఎం వైఎస్ జగన్‌ను సాగనంపేందుకు సిద్ధం కావాలని మాజీ కౌన్సిలర్ వైయా రామాంజనేయులు ప్రజలకు పిలుపునిచ్చారు. పట్టణంలోని 6, 8వ వార్డులలో మంగళవారం సాయంత్రం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు రామకృష్ణ, బొమ్మా మోహన్‌కృష్ణ, గంపమల్లయ్య, తిమ్మప్ప, నిరంజన్, మోదీన్, సాయి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నియమావళికి అనుగుణంగా పనిచేయాలి: జేసీ

ఉరవకొండ, ఫిబ్రవరి 6: ఎన్నికల నియమావళికి అనుగుణంగా అధికారులు పనిచేయాలని జేసీ కేతన్‌గార్గ్ సూచించారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గంలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, డీటీలు, ఎస్ఐలు, ఎలక్షన్ ట్రైనర్‌లతో సమావేశం నిర్వహించారు. ప్రతి పోలింగ్ స్టేషన్ లోనూ మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. పోలీస్, రెవెన్యూ పంచాయతీ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. తహసీల్దారు సీకే శ్రీనివాసులు, ఎంపీడీవో అమృత్‌రాజ్, డీటీ హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి

యాడికి, ఫిబ్రవరి6: టవల్ ఆరేయడానికి వెళ్లి విద్యుదాఘాతంతో రంగమ్మ (73) మృతిచెందిన సంఘటన మంగళవారం పుప్పాల గ్రామంలో జరిగిందని పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన రంగమ్మకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అందరూ వివాహితులే. భర్త మరణించడంతో రంగమ్మ ఒంటరిగా నివసిస్తోంది. మంగళవారం ఉదయం బట్టలు ఉతుక్కొని టవల్‌ను ఆరవేసే సమయంలో ఇనుప కడ్డీకి కరెంట్ ప్రసారం కావడంతో రంగమ్మకు షాక్ తగిలి మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి కుమారుడు హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

టీడీపీ నాయకుడి ఉల్లిగడ్డల టెంటుకు నిప్పు

పుట్లూరు, ఫిబ్రవరి6: మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో టీడీపీ నాయకుడు బ్రహ్మయ్యకు చెందిన ఉల్లి ఫలసాయానికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. పోలీసులు తెలిపిన మేరకు బ్రహ్మయ్య తన పొలంలో ఉల్లి గడ్డను కోసి ఆరబెట్టాడు. సాయంత్రం కావడంతో ఉల్లిగడ్డలకు నీడకోసం టెంటు వేశాడు. గుర్తు తెలియని వ్యక్తులు టెంటుకు నిప్పుపెట్టడంతో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు వెంటనే మంటలను ఆర్పివేశారు. టెంటు పూర్తిగా కాలిపోయి బస్తా మేర ఉల్లిగడ్డలు కాలిపోయినట్లు బాధిత రైతు తెలిపారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని పరిశీలించారు.

పెట్టుబడిదారుల అవగాహన కార్యక్రమం

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 6: పట్టణంలోని శ్రీ శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాలలో మంగళవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో డిగ్రీ విద్యార్థులకు పెట్టుబడిదారుల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్ మాట్లాడుతూ పెట్టుబడిపై అవగాహన, రక్షణ అంశాలపై విద్యార్థులను చైతన్యవంతులను చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఏపీఎస్ఎస్‌డీసీ కోఆర్డినేటర్ శ్రావణి మాట్లాడుతూ పెట్టుబడిదారులు, సామాన్య ప్రజలు, తమ కష్టార్జిత డబ్బును వివిధ నాన్ బ్యాంక్ సంస్థలలో పెట్టుబడి పెట్టడానికి ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్ఎస్‌డీసీ కళాశాల కోఆర్డినేటర్ బాలగంగాధర్‌తిలక్, ప్రజా సంబంధాల అధికారి బసెట్టి క్రిష్టయ్య, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, డాక్టర్ అమీర్, ప్రకాష్, రఘు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ రైల్వే ఉద్యోగి మృతి

గుత్తి, ఫిబ్రవరి 6: విద్యుదాఘాతానికి గురై కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రైల్వే ఉద్యోగి షేక్షావలి (40) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గుత్తి పట్టణంలో బీసీ కాలనీలో షేక్షావలి నివాసముంటున్నాడు. రెండు రోజుల కిందట పాతకొత్తచెరువు రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్వే పంప్‌హౌస్‌లో విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు షేక్షావలి విద్యుదాఘాతంతో గాయపడ్డాడు. కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పట్టపగలే చోరీ

కణేకల్లు, ఫిబ్రవరి 6: మండల కేంద్రంలోని రామ్‌నగర్‌లో మంగళవారం పట్టపగలే ఇద్దరు యువకులు ఓ ఇంట్లో చోరీ చేసినట్లు బాధితులు పేర్కొన్నారు. రామ్‌నగర్‌లో హోటల్ నిర్వహించుకునే శ్రీనివాసులు ఇంటికి తాళం వేసి తన కుటుంబ సభ్యులతో కలిసి రెండురోజుల క్రితం ఊరికి వెళ్లాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఇద్దరు యువకులు మంగళవారం మధ్యాహ్నం ఇంటితాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న ఐదు తులాల బంగారు, రూ. ఆరువేలు దోచుకెళ్లినట్లు బాధితులు పేర్కొన్నారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా క్లూస్‌టీం రంగంలోకి దిగి సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

నేడు యాడికిలో యువచైతన్య ర్యాలీ

యాడికి, ఫిబ్రవరి 6: తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకరరెడ్డి బుధవారం యాడికిలో యువచైతన్య ర్యాలీని నిర్వహించనున్నట్లు క్లాస్-1 కాంట్రాక్టర్ చవ్వా గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్యలు ఒక ప్రకటనలో తెలిపారు. యాడికి మండలంలో యువచైతన్య బస్సుయాత్ర బుధవారంతో పూర్తికానున్నట్లు తెలిపారు. యాడికిలోని ఓంశాంతి కేంద్రం నుంచి కోనరోడ్డు సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

టీడీపీ హయాంలోనే బెస్తలకు సంక్షేమ పథకాలు

కణేకల్లు, ఫిబ్రవరి 6: టీడీపీ అధికారంలో ఉన్నప్పుడే బెస్తలకు అనేక సంక్షేమ పథకాలు అందించారని ఆ పార్టీ రాష్ట్ర బెస్త సాధికారిక కమిటీ కన్వీనర్ యాటగిరి రాంప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని పూలచెర్ల గ్రామంలో మంగళవారం ఆయన బెస్త భరోసా బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయు డు ఉంటేనే బెస్తలకు న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం టీడీపీ హయాంలో బెస్తలకు అందించిన సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బెస్తనాయకులు నారాయణస్వామి, చేపల హరి, విజయ్‌కుమార్, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

సొంత డబ్బుతో రోడ్డుకు మరమ్మతులు



కంకర తేలిన రోడ్డుపై టిప్పర్‌తో మట్టిని వేయిస్తున్న సర్పంచ్ రాము తదితరులు

బెళుగుప్ప, ఫిబ్రవరి 6: మండలంలోని ఆవులెన్నలో టీడీపీ సర్పంచ్ రాము సొంత డబ్బు వెచ్చించి గుంతలమయమైన రోడ్డుకు ఎర్రమట్టి వేయించి మరమ్మతులకు చర్యలు తీసుకున్నారు. ప్రధాన రహదారి గేట్ నుంచి గ్రామంలోకి వెళ్లే రోడ్డు కంకర తేలి గుంతలమయమై అధ్వానంగా ఉంది. ద్విచక్ర వాహనాలలో వెళ్లాలన్నా గ్రామస్థులు ఇబ్బంది పడేవారు. దీంతో ఒకటిన్నర కిలోమీటరు రోడ్డుకు సర్పంచ్ సొంత డబ్బుతో మంగళవారం మరమ్మతులు చేయించారు. దీనిపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

సీనియర్ అసిస్టెంట్ రిలీవ్

తాడిపత్రి, ఫిబ్రవరి 6: మున్సిపాలిటీలో డెప్యుటేషన్‌పై సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న చాంద్‌బాషాను కమిషనర్ రవి రిలీవ్ చేశారు. నంద్యాల మున్సిపాలిటీలో పనిచేస్తున్న చాంద్‌బాషా డెప్యుటేషన్‌పై తాడిపత్రికి వచ్చారు. ఒక పార్టీకి అనుకూలంగా పనిచేస్తున్నాడంటూ టీడీపీ నాయకులు ఎన్నికల కమిషన్, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ 24గంటల్లోపు చాంద్‌బాషాను రిలీవ్‌చేయాలని ఆదేశించారు. నాన్చుడి ధోరణి అవలంబిస్తున్న కమిషనర్‌పై నాలుగురోజులక్రితం 'ఆంధ్రజ్యోతి'లో కలెక్టర్ ఆదేశాలను కమిషనర్ పాటించకపోవడంపై కథనం వచ్చింది. స్పందించిన కమిషనర్ వెంటనే సీనియర్ అసిస్టెంట్ చాంద్‌బాషాను రిలీవ్ చేశారు. రిలీవ్ అయిన చాంద్‌బాషా నంద్యాల మున్సిపాలిటీలో జాయిన్ అయ్యారు.

పోలేరమ్మ దేవరకు హాజరైన మాజీ ఎమ్మెల్యే



జితేంద్రగౌడ్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యుడు

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి6: పట్టణంలోని పాత బస్టాండ్‌లో వెలసిన పోలేరమ్మ దేవర మంగళవారం జరిగింది. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. దేవరకు మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం జితేంద్రగౌడ్‌ను ఆలయ కమిటీ సభ్యుడు టీ దొడ్డప్ప సన్మానం చేశారు. కార్యక్రమంలో రాయల రామయ్య, తలారిమస్తానప్ప, పాల మల్లికార్జున, వీ రాముడు, పులికొండ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

గుత్తి, ఫిబ్రవరి 6: పట్టణంలోని ఎంఎస్ జూనియర్ కళాశాలలో సక్ష్యం సంస్థ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 8న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ నిర్వాహకులు సగర ఆకుల శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కడప పుష్పగిరి ఆసుపత్రి సహకారంతో ఎంఎస్ జూనియర్ కళాశాలలో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

యువనాయకుడి పర్యటనకు రాకపోతే కఠిన చర్యలు

- గ్రామ వలంటీర్లకు పంచాయతీ కార్యదర్శి ఆదేశం

యాడికి, ఫిబ్రవరి 6: యువ నాయకుడి పర్యటనకు గ్రామ వలంటీర్లు రాకపోతే కఠిన చర్యలు ఉంటాయని యాడికి పంచాయతీ కార్యదర్శి వాట్సాప్ ద్వారా మెసేజ్ చేయడంపై విమర్శలు వస్తున్నాయి. ఎన్నికల నేపథ్యంలో గ్రామ వలంటీర్లను ఇలా బలవంతంగా ప్రచారానికి రావాలని పిలవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. గ్రామ వలంటీర్ల గ్రూపులో పంచాయతీ కార్యదర్శి మెసేజ్ ఇలా ఉంది.



అందరికీ నమస్కారం...

యువనాయకులు శ్రీ కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి గారు ఈరోజు [06/02/2024] అనగా మంగళవారం నాడు సాయంత్రం 03:30 గంటలకు యాడికి గ్రామం నందు గల 8వ వార్డ్ (నారాయణ స్వామి కాలనీ, బుగ్గ రోడ్ నుంచి) నందు పర్యటించనున్నారు...

కావున ఈ కార్యక్రమానికి యాడికి గ్రామ వాలంటీర్స్ (1 To 5) అందరూ తప్పకుండా హాజరు కావాలని తెలియజేయడమైనది... మరియు హాజరు కాని వాలంటీర్స్ పై కచ్చితంగా కఠినచర్యలు ఉంటాయని తెలియజేయడమైనది...

---- ఎక్జిక్యూటివ్ ఆఫీసర్,
యాడికి గ్రామ పంచాయతీ.

4:54 PM

సోషల్ మీడియాలో పంపిన మెసేజ్

అందరికీ నమస్కారం...

యువనాయకులు శ్రీ కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి గారు ఈరోజు 6-2-2024 అనగా మంగళవారం సాయంత్రం 3:30గంటలకు యాడికి గ్రామం నందుగల 8వవార్డు (నారాయణస్వామి కాలనీ, బుగ్గరోడ్డు నుంచి) నందు పర్యటించనున్నారు... ఈ కార్యక్రమానికి యాడికి గ్రామ వలంటీర్లు (1టూ5) అందరూ తప్పకుండా హాజరుకావాలి. హాజరుకానీ వలంటీర్లపై కఠిన చర్యలు ఉంటాయి.

ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, యాడికి గ్రామ పంచాయతీ.

ఎమ్మెల్యే తనయుడు యాడికిలో పర్యటిస్తే గ్రామ వలంటీర్లు హాజరుకావాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం తగదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పంట నమోదు పరిశీలన



పంట నమోదును పరిశీలిస్తున్న అధికారి

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 6: మండలంలో జరుగుతున్న పంటనమోదు కార్యక్రమాన్ని రాయదుర్గం వ్యవసాయ ఏడీఏ లక్ష్మానాయక్ మంగళవారం పరిశీలించారు. మండలంలోని ఉంతకల్లు, హరేసముద్రం, గోవిందవాడ గ్రామాల శివారులోని పంట పొలాల్లో జరుగుతున్న పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. పంట నమోదు వేగం పెంచాలని ఏడీఏ సిబ్బందితో అన్నారు. మండల వ్యాప్తం 6260 ఎకరాలలో ఈ కేవైసీ నమోదైందని 92 శాతం పూర్తి అయినట్లు ఏడీఏ తెలిపారు. కార్యక్రమంలో రాయదుర్గం టెక్నికల్ ఏఓ అహ్మద్‌బాషా, బొమ్మనహాళ్ ఏఓ సాయికుమార్, సిబ్బంది వీరాంజినేయులు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగి కుటుంబానికి పరామర్శ

గుంతకల్లు: గుండె నొప్పితో మృతి చెందిన రైల్వే మజ్దూర్ యూనియన్ మాజీ ఏడీఎస్ మహమ్మద్ గౌస్ కుటుంబాన్ని మాజీ శాసన సభ్యుడు జితేంద్రగౌడు మంగలశారం పరామర్శించారు. కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గౌస్ సోమవారం మరణించిన సంగతి విదితమే. గుంతకల్లులోని గౌస్ నివాసానికి వెళ్లిన జితేంద్రగౌడు, టీడీపీ నాయకులు మృతదేహానికి పూలమాలను వేసి శ్రద్ధాంజలి ఘటించారు. గౌస్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, గుమ్మనూరు వెంకటేశులు, తలారి మస్తానప్ప, హనుమంతు, ఆటో ఖాజా, ఫ్రూట్ మస్తాన్, మహదేవ్, మన్నూఖాన్ పాల్గొన్నారు.

ఓపీఎస్‌ను పునరుద్ధరించే పార్టీకే మద్దతు



పోస్టర్ విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

గుంతకల్లు టౌన్, ఫిబ్రవరి 6: పాత పెన్షన్‌ను పునరుద్ధరించే పార్టీకే మద్దతు ఇస్తామని యూటీఎఫ్ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని భగత్‌సింగ్ పురపాలక ప్రాథమిక పాఠశాల ఆవరణలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఓట్ ఫర్ ఓపీఎస్ పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ తరువాత భద్రత కోసం సాధించుకున్న పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, సీపీఎస్, జీపీఎస్ అంటూ భవిష్యత్తును అంధకారంలోకి నెట్టివేసి చెలగాటమాడుతు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 6నుంచి 15వరకు పోస్ట్‌కార్డు ఉద్యమం, 13నుంచి 29 వరకు గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరుతూ ఉద్యమం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రామప్పచౌదరి, జిల్లా కోశాధికారి రాఘవేంద్ర, రామకృష్ణ, రాజకుమార్, కల్పన, పావన, మురళి, శంకరయ్య, ఎల్లన్న, రఫీ, చిన్నరంగన్న, రేవణసిద్దయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

ఉజ్వల హోంకు అనాథ మహిళ



అనాథ మహిళను కళ్యాణదుర్గం ఉజ్వల హోంలో అప్పగించిన ఐసీడీఎస్ అధికారులు

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 6: ఓ అనాథ మహిళను ఐసీడీఎస్ అధికారులు కళ్యాణదుర్గం ఉజ్వల హోంకు మంగళవారం అప్పగించారు. కంబదూరు మండలం అండేపల్లి సచివాలయం పక్కనే ఉన్న బ్రహ్మయ్య దేవాలయంలో నాలుగు రోజుల నుంచి ఓ అనాథ మహిళ ఉంటోంది. ఆలయ పూజారి గంగన్న ఆమెకు అన్నం పెడుతూ సంరక్షించాడు. ఊరు, పేరు ఏ వివరాలు అడిగినా తనకు తెలియదు అంటూ ఆమె సమాధానం చెబుతోంది. దీంతో సచివాలయ మహిళా పోలీస్ ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే సీడీపీవో వనజా అక్కమ్మ, సూపర్‌వైజర్లు జ్యోతి లక్ష్మి, సుశీల అక్కడకు వెళ్లి ఆమెను కళ్యాణదుర్గం ఉజ్వల హోంలో చేర్పించారు. కళ్యాణదుర్గం, కణేకల్లు, రాయదుర్గం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పలు మండలాలకు ఈ అనాథ మహిళ ఆచూకీని కనిపెట్టాలని సమాచారాన్ని చేరవేశారు. దాంతోపాటు జిల్లా ఎస్పీకి కూడా ఇదే సమాచారాన్ని తెలియజేశారు.

వైసీపీ సమావేశంలో వలంటీర్లు, ఎంఎల్ఓ

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 6: వైసీపీ సమావేశంలో వలంటీర్లు, ఎంఎల్ఓలు పాల్గొనడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో మంగళవారం వైసీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం వైసీపీ మండల కన్వీనర్ రామాంజినేయులు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి రాయదుర్గం సమన్వయకర్త, ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి పాల్గొని ఎన్నికల ప్రచారంపై నాయకులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో వైసీపీ కార్యకర్తల తో పాటు మండలంలోని శ్రీధరఘట్ట, ఉద్దేహాళ్ గ్రామాలకు చెందిన వలంటీర్లు, కణేకల్లు ఎంఎల్ఓ సుంకేష్, ప్రభుత్వ వైన్స్‌షాప్ లో పనిచేసే సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. దీన్ని గమనించిన వారు వలంటీర్ వ్యవస్థను జగన్ ప్రభుత్వం తమ పార్టీ కార్యక్రమాలకు యథేచ్ఛగా వాడుకుంటోందని విమర్శిస్తున్నారు. అసలు వలంటీర్లు ప్రభుత్వానికి పనిచేస్తున్నారా, లేక వైసీపీకి అనుకూలంగా పనిచేస్తున్నారా అని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



సమావేశంలో పాల్గొన్న వలంటీర్లు (వృత్తంలో)



వైసీపీ సమావేశ వేదికపై ఎంఎల్ఓ సుంకేష్

కర్ణాటక మద్యం విక్రేత అరెస్టు

బెళుగుప్ప, ఫిబ్రవరి 6: మండలంలోని కాలువపల్లిలో కర్ణాటక మద్యం విక్రయదారున్ని మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ శివ తెలిపారు. ఇంటి వద్ద విక్రయిస్తుండగా 15 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.